₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 23

డిసెంబరు 1-15, 2018

'స్మార్ట్ కరీంనగర్' కోసం.. సిటీ పౌరులం ముందుకొద్దాం





## నా తెలంగాణ ప్రజలారా !

## Vote for

- ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా 'పౌర సేవల' చట్టం
- ఖర్చు లేకుండా నాణ్యమైన పాఠశాల విద్య - ప్రతి బిడ్డకీ
- ఒక్క రూపాయి ఆర్థిక భారం లేకుండా మంచి ప్రమాణాల ఆరోగ్యం - ప్రతి కుటుంబానికి
- మహిళల రక్షణకు స్థానిక కోర్టుల ఏర్పాటు
- వ్యవసాయంలో ఆదాయం
- స్థానిక ప్రభుత్వాలకి రాష్ట్ర బడ్జెట్ నుంచే 'తలసరి' కేటాయింపు





# 'ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ'

'ఫ్యూచర్ఆఫ్‌తెలంగాణ' పేరుతో వైఎల్‌పసీ (యంగ్‌లీడర్స్ ఫర్ యాక్టివ్ సిటిజన్‌షిప్) - ట్విట్టర్ ఇటీవల హైదరాబాద్ బీపీ బిర్లా ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో డా॥ జేపీ నేతృత్వంలోని 'ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్' (ఎఫ్‌డీఆర్) యువ పరిశోధకులు కూడా పాల్గొన్నారు. సమావేశానికి హాజరైనవారు ప్యానలిస్టులనుద్దేశించి కొన్ని సాధారణ ప్రశ్నలను అడిగారు గానీ... పాలనకు సంబంధించిన అసలైన అంశాలు, అవినీతిరహితంగా, సమర్థంగా స్కీములు అమలు వంటి వాటిని మాత్రం చర్చలోకి తేలేదు. నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల గురించి కొన్ని బృందాలు మాత్రం కొన్ని ప్రశ్నల్ని వేశాయి.



## తెలంగాణ దశ, దిశను మార్చే ఎజెండాకే ఓటేద్దాం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల్ని, పార్టీల్ని డిమాండ్ చేయమని లోక్‌సత్తా కోరుతున్న 6 అంశాల ఎజెండాను పార్టీ నేతలు హైదరాబాద్ పర్వత్‌నగర్‌లోని కార్యాలయంలో విడుదల చేశారు. తెలంగాణలో నిజమైన అవినీతిరహిత పాలనను, అభివృద్ధిని, స్వయంపాలనను అందించే ఈ ఎజెండాను నెరవేర్చే వారికే ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

డిసెంబర్ 1-15, 2018 సంపుటి - 9 సంచిక - 23




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

ప్రజలు యాచకులు కాదు, ప్రభుత్వాన్ని.......... 5
మేధావులు 'దివాంధులు' కావద్దు.................... 8
భావదారిద్ర్య రేఖకి దిగువన కొట్టుమిట్టాడుతున్న.. 10
నాణ్యమైన విద్య లేకుండా.. తెలంగాణలో.......... 12
మ్యాథ్స్‌లో మరీ అధ్వాన్నం............................ 18
లోక్‌సత్తా మిత్రులారా... ఎన్నికల్లో పదండి......... 20
'స్మార్ట్ కరీంనగర్' కోసం సిటీ పౌరులం............. 24
బిడ్డల బాధ్యత ఇలాగేనా? ........................... 28
రాజకీయమంటే ఇదా? ...............................30
(మీడియాలో) 'కీ' కామెంట్లు ! ........................ 32
నివారించదగ్గ ఆ మరణాలను ఆపే శక్తి వైద్యులకే... 34

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ఫోన్ : **040-23310288**
ఫోన్ / ఫ్యాక్స్ : **040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**

# మీ అభిప్రాయాలు చెప్పండి..

*ఆత్మీయ పాఠకులారా!*


లోక్‌సత్తా భావజాలాన్ని ఇతరత్రా మార్గాలతో పాటు రకరకాల ప్రచురణల ద్వారా కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గత 22 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. ఏ అంశం మీదైనా, ఎంత సంక్లిష్టమైన, వివాదాస్పదమైన, భావోద్వేగపూరితమైన సమస్యమీదైనా లిఖితపూర్వకంగా తన వైఖరిని చెప్పే సాహసం, నిబద్ధతగల రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా! సమాజంలో, దేశంలో, ప్రపంచంలో మునుపెన్నడూ లేనంత శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నా కూడా.. లోక్‌సత్తా భావజాలం ఇప్పటికీ చెక్కుచెదరకుండా దిక్సూచిగానే కొనసాగుతోందని ఈ ప్రచురణల్లో భాగస్వాములైనవారిగా నిర్ద్వంద్వంగా చెప్పగలుగుతున్నాం. వీలైనన్ని ఎక్కువ ప్రచురణలతో నిరంతరాయంగా ఈ అజరామర భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాన్నదే మా (మీ) ఆకాంక్ష. మ్యాగజైన్ ప్రచురణల్లో భాగంగా పక్షపత్రికగా 'లోక్‌సత్తా టైమ్స్'ని, మాసపత్రికగా 'జనబలం'ని తీసుకొస్తున్నామని మీకందరికీ తెలుసు. ఇటీవలికాలంలో ప్రింట్ ధర, ఇతర ఖర్చులు పెరిగిపోవటంతో ఈ పత్రికల ప్రచురణ భారంగా మారింది. మన వనరులకు - పత్రికల వ్యయానికి పొంతన కుదరటం లేదు. ఇదేసమయంలో ఏదోకరూపంలో భావజాలాన్నయితే ప్రజల్లోకి తీసుకెళ్తూండాలి. ఈ నేపథ్యంలో.. ఏ వేదిక ద్వారా ప్రచురితమైనా లోక్‌సత్తా టైమ్స్, జనబలం రెండూ లోక్‌సత్తా భావజాల పత్రికలే కాబట్టి రెంటినీ విలీనం చేసి ఒకే పత్రికగా తీసుకురావలనే ప్రతిపాదన వచ్చింది. "రెండిటిలో ఏది తేవాలి, పక్షపత్రికగానా లేక మాసపత్రికగానా, ప్రింట్ ఎడిషన్‌గానా, ఆన్‌లైన్ పత్రికగానా?".. అనే చర్చ జరుగుతోంది. లోక్‌సత్తా కుటుంబ సభ్యులుగా ఈ అంశాలకు సంబంధించి మీ అభిప్రాయాలను కూడా తెలియచేయండి. మొత్తాన్నీ కూలంకషంగా సమీక్షించి నిర్ణయం తీసుకుందాం. అయితే ఆలస్యమయ్యేకొద్దీ భారం పెరుగుతుంది. డిసెంబర్-జనవరిల్లోనే నిర్ణయం అమల్లోకి వచ్చేయాలి. మీ అభిప్రాయాల్ని, ఆదాయాన్ని పెంచుకునే మార్గాల సూచనల్ని దిగువ పేర్కొన్న ఐడీలకి సాధ్యమైనంత త్వరగా ఈ-మెయిల్ చేయవలసిందిగా మనవి.

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

- ఎడిటోరియల్ టీం

# ప్రజలు యాచకులు కాదు, ప్రభుత్వాన్ని పోషించేవారు..

## ప్రభుత్వం చేయాల్సిన 6 అంశాల కోసం పట్టుపట్టండి: తెలంగాణ ప్రజానీకానికి జేపీ విజ్ఞప్తి





డిసెంబర్ 7న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు అంశాల ఎజెండాను ప్రజలు తమ డిమాండ్‌గా మార్చుకుని వాటిపై రాజకీయ పార్టీలు, నేతల నుంచి స్పష్టమైన హామీలు తీసుకోవాలని లోక్‌సత్తా, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలంగాణ ప్రజానీకానికి పిలుపునిచ్చారు.

"ప్రస్తుతం అన్ని పార్టీలు తాయిలాలతోను, ఉచితాలతోను ప్రజలని ప్రలోభపెట్టటం కోసం పోటీ పడుతున్నాయి. కానీ ప్రజలకి భద్రతనివ్వటం, మౌలిక సదుపాయాలు కల్పించటం, విద్యా, ఆరోగ్యాలనందించి ఆదాయాలని పెంచే ఏర్పాటు చేయటం అన్ని పార్టీలు విస్మరిస్తున్నాయి.

"ప్రభుత్వం కేవలం ఉద్యోగుల జీతాల పంపిణీ కోసం, ఉచితాలు, తాయిలాలు పంచిపెట్టటం కోసం, అవకాశాన్ని బట్టి లంచాలు మింగటం కోసం, ప్రజాధనాన్ని సొంతం చేసుకోవటం కోసం మాత్రమే ఉన్నట్లుగా మన రాజకీయం, ఎన్నికలు నడుస్తున్నాయి. ప్రజల పన్నుల డబ్బుతో ప్రజలకందాల్సిన ఉమ్మడి వసతులు, సేవలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పన్నులు కట్టే ప్రజలని కాలక్రమేణా యాచకులుగా మార్చేస్తున్నారు. చట్టబద్ధపాలన, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురికాగా, అధికారం అంతా ముఖ్యమంత్రి చేతుల్లోను, శాసనసభ్యుల చేతుల్లోను కేంద్రీకృతమై, స్థానిక ప్రభుత్వాలు, సమాజం నిర్వీర్యమయిపోయాయి. వ్యవసాయంలో ఆదాయాలు కృశించి గ్రామీణ జీవనం దుర్భరమయిపోతోంది.

"ఈ 6 అంశాల ఎజెండాతో.. తెలంగాణలోని ప్రతి బిడ్డకూ ఖర్చు లేకుండా నాణ్యమైన చదువు అందుతూ, ప్రతి కుటుంబానికీ జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా మంచి ప్రమాణాల వైద్యం అందుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం లేకుండా పనులు జరుగుతూ, చట్టం అందరికీ సమానంగా అమలవుతూ, మన పంటలకు లాభసాటి ధరలు లభిస్తూ, స్థానికంగానే అన్ని పనులూ తేలికగా మన ఇంటి ముందే, మన పర్యవేక్షణలోనే జరుగుతూంటే .. ఆ పాలన ఎంత సమున్నతంగా, సుఖసంతోషమయంగా ఉంటుందో ఊహించుకోండి. ఈ ఎజెండా అమలుకు పెద్ద ఖర్చు కూడా అవదు. నేతల ఆర్భాటాలు, తాయిలాల కోసం చేసే ఖర్చులో కొద్దిపాటి కూడా ఉండదు. కేవలం రాజకీయ సంకల్పం ఉంటే చాలు.. కులం, మతంతో సంబంధం లేకుండా తెలంగాణ ప్రజలందరికీ ఎంతో మేలు చేసే ఎజెండా ఇది! తెలంగాణను సాధించుకున్నది, తెలంగాణలో ఎన్నికలు జరిగేది ఇలాంటి ఎజెండా సాధన కోసమా? పార్టీలు, నేతల కోసమా?" అని జేపీ ప్రశ్నించారు.

ఈ 6 అంశాల ఎజెండాను తమ మేనిఫెస్టోల్లో, హామీల్లో చేర్చిన పార్టీలు, అభ్యర్థులకు మాత్రమే ఓటు వేయాలని ప్రజలకు జేపీ సూచించారు.

**తెలంగాణ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుకు ప్రాతిపదికగా చేసుకోవాలంటూ ప్రజల ముందు లోక్‌సత్తా ఉంచిన 6 అంశాల ఎజెండాను జయప్రకాష్ నారాయణ్ మీడియాకు విడుదల చేశారు. వివరాలు:**

**1) హక్కుగా 'పౌర సేవల' చట్టం:**

ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు హక్కుగా జరగాల్సిన పని చేయించుకోవటానికి ప్రజలు లంచం ఇవ్వటం తెలంగాణలో కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక కూడా యధాతథంగా కొనసాగుతోంది. 'ఇండియా కరప్షన్ సర్వే 2018'లో కూడా 43 శాతం మంది ఇదే మాట చెప్పారు. ఎలక్ట్రానిక్ సేవలు పెరుగుతున్నా.. లంచం, వేధింపు, జాప్యం, రికమండేషన్ లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేయించుకురావటం రాష్ట్రంలో దాదాపు అసాధ్యంగా ఉంది. మెజారిటీ ప్రజల్ని పీడిస్తున్న రోజువారీ అవినీతి నుంచి తెలంగాణను విముక్తం చేయాలంటే.. ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలందించే 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని తీసుకురావాలని పార్టీల్ని, అభ్యర్థుల్ని డిమాండ్ చేయాలి. ఈ చట్టం వస్తే.. సర్కారీ ఆఫీసుల్లో ప్రతి పనికీ నిర్దిష్ట గడువుతో బోర్డుల్ని ఏర్పాటు చేస్తారు. ఆలోగా పనిపూర్తి చేయకపోతే రోజుకు రూ.250కి తగ్గకుండా పరిహారాన్ని దరఖాస్తు చేసుకున్న ప్రజలకు చెల్లిస్తారు.

**2) ఖర్చు లేకుండా నాణ్యమైన పాఠశాల విద్య – ప్రతి బిడ్డకూ:**

వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలను ప్రతి బిడ్డకూ అందించటంలో కీలకమైన పాఠశాల విద్యాప్రమాణాలలో తెలంగాణ రాష్ట్రం అధ్వాన్నంగా ఉంది. 2016 'అసర్' సర్వే ప్రకారం తెలంగాణ గ్రామీణ ప్రభుత్వ స్కూళ్లలోని 8వ తరగతి విద్యార్థుల్లో 49 శాతం మంది భాగాహారం చేయలేరు. మూడవ తరగతి విద్యార్థుల్లో కేవలం 30.7 శాతం మంది మాత్రమే తీసివేత చేయగలరు. 5వ తరగతి విద్యార్థుల్లో కేవలం 40 శాతం మంది మాత్రమే రెండవ తరగతి పుస్తకాన్ని చదవగలరు. తెలంగాణ విద్యాశాఖ అంతర్గత సర్వేల్లో పట్టణ ప్రాంతాల్లోనూ ఇవే ఫలితాలు వచ్చాయి. సామర్థ్యాన్ని వికసింపచేసే ఏర్పాట్లు లేకపోవటం వల్ల తెలంగాణలో విద్యార్థుల ప్రతిభ.. సగటు కంటే దిగువనే ఉన్నట్టు జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వే కూడా తెలిపింది. ఈ సర్వేలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లాల్లో సైతం 75 శాతం కంటే కచ్చితమైన

**2016 'అసర్' సర్వే ప్రకారం తెలంగాణ గ్రామీణ ప్రభుత్వ స్కూళ్లలోని 8వ తరగతి విద్యార్థుల్లో 49 శాతం మంది భాగాహారం చేయలేరు. మూడవ తరగతి విద్యార్థుల్లో కేవలం 30.7 శాతం మంది మాత్రమే తీసివేత చేయగలరు. 5వ తరగతి విద్యార్థుల్లో కేవలం 40 శాతం మంది మాత్రమే రెండవ తరగతి పుస్తకాన్ని చదవగలరు. తెలంగాణ విద్యాశాఖ అంతర్గత సర్వేల్లో పట్టణ ప్రాంతాల్లోనూ ఇవే ఫలితాలు వచ్చాయి. సామర్థ్యాన్ని వికసింపచేసే ఏర్పాట్లు లేకపోవటం వల్ల తెలంగాణలో విద్యార్థుల ప్రతిభ.. సగటు కంటే దిగువనే ఉన్నట్టు జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వే కూడా తెలిపింది. ఈ సర్వేలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లాల్లో సైతం 75 శాతం కంటే కచ్చితమైన జవాబులు గుర్తించినవారు ఒక శాతం లోపే ఉన్నారు.**

జవాబులు గుర్తించినవారు ఒక శాతం లోపే ఉన్నారు. ఇలాంటి బడి చదువులుంటే తెలంగాణ యువతకు ఉపాధి ఎలా సాధ్యం? అభివృద్ధి, కులనిర్మూలన ఇంకెలా సాధ్యం? డబ్బులేమన్నా తక్కువ ఖర్చు చేస్తున్నారా అంటే.. అదీ లేదు. ఒక్కో పాఠశాల విద్యార్థి మీద తెలంగాణ ప్రభుత్వం రూ.40,000 –50,000 ఖర్చు చేస్తోంది. కానీ ఆ డబ్బు ద్వారా పిల్లలకు మంచి చదువు వస్తోందా, లేదా అని పర్యవేక్షించాలన్న ఆసక్తి లేదు. కొన్ని గురుకుల పాఠశాలల్లోనే కాకుండా.. రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో ప్రతి బిడ్డకీ విద్యాప్రమాణాల్ని పెంచేందుకు నిర్దిష్టమైన చర్యల కోసం అన్ని పార్టీల్నీ డిమాండ్ చేయాలి.

**3) ఒక్క రూపాయి ఆర్థిక భారం లేకుండా అన్ని స్థాయిల్లో మంచి ప్రమాణాల ఆరోగ్యం – ప్రతి కుటుంబానికీ:**

కేవలం ఆరోగ్య ఖర్చులు భరించలేక పేదలుగా మారుతున్నవారి సంఖ్య తెలంగాణలోనూ పెద్దఎత్తున ఉంది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఒక కుటుంబానికి సరాసరి ఆరోగ్య ఖర్చు రూ.26,092 కాగా, గ్రామీణ ప్రాంతంలో రూ.13,698 అని జాతీయ ఆరోగ్య ముఖచిత్రం–2018 తెలిపింది. కిట్‌లు, బీమాలతో పరిష్కారమయ్యే సంక్షోభం కాదిది. ప్రతి కుటుంబానికీ ఫ్యామిలీ డాక్టర్‌ను అందుబాటులోకి తెచ్చి విశ్వసనీయ,

మంచి ప్రమాణాల వైద్యాన్ని ప్రజలకు జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందించాలన్నది ఈ ఎన్నికల్లో ప్రజల డిమాండ్ కావాలి.

**4) మహిళల భద్రతకి స్థానిక కోర్టుల ఏర్పాటు:**

మహిళల భద్రత తెలంగాణలో తీవ్ర సమస్యగా ఉంది. షీ టీంల వంటి ఏర్పాట్లతో మహిళల ఫిర్యాదుల్ని కొంతమేరకు పట్టించుకుంటున్నా, దోషులకు పడుతున్న శిక్షలు 10 శాతం లోపే ఉంటున్నాయి. వేగంగా, తక్కువ ఖర్చుతో చిన్న కేసుల్ని విచారించేందుకు స్థానిక న్యాయస్థానాల ఏర్పాటు చట్టాన్ని వెంటనే అమల్లోకి తేవాలి. వేధింపుల దశలోనే శిక్షలు పడే ఏర్పాటు చేస్తే మహిళలపై అత్యాచారాలు చాలా మేర తగ్గుతాయి, చట్టబద్ధపాలన మెరుగు పడుతుంది. స్థానిక న్యాయస్థానాల చట్టం 2009లో వచ్చినా ఇప్పటికీ తెలంగాణలో ఒక్క కోర్టు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రతి మండల కేంద్రంలో, పట్టణాల్లో ప్రతి 50,000 మందికి ఒక స్థానిక కోర్టును ఏర్పాటు చేస్తే.. మహిళలకు భద్రత లభించటమేకాకుండా.. కోర్టు జాప్యాలు, ఖర్చులు భరించలేక నలిగిపోతున్న అసంఖ్యాక పేద, మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుంది. కాబట్టి, ప్రజలకు చౌకగా, వెంటనే న్యాయం అందించే స్థానిక కోర్టుల ఏర్పాటు ఈ ఎన్నికల్లో మన డిమాండ్ కావాలి.

**5) వ్యవసాయంలో ఆదాయం:**

రైతు రుణమాఫీ లాంటి పథకాల వల్ల ప్రయోజనం ఏమీ కలగలేదని అధ్యయనాలు చెబుతున్నా మళ్లీ పార్టీలు అదే హామీనిస్తున్నాయి. అలాగే రైతుబంధు పేరుతో ఇస్తున్న పెట్టుబడి రాయితీ వల్ల కలిగే పరిమిత ప్రయోజనం కూడా కౌలురైతులకు దక్కటం లేదు. అందుకే పండించిన పంటకు ప్లెడ్జి రుణాలు, లాభసాటి ధర పొందే విధానాల కోసం రైతులు డిమాండ్ చేయాలి. దీనివల్ల రైతులు, కౌలురైతులు అని తేడా లేకుండా అందరికీ లాభం జరుగుతుంది. నిల్వ సదుపాయాల్ని ఎక్కడికక్కడ పెంచి, మార్కెట్ ధర సరిగా లేనప్పుడు వాటిలో దాచుకున్న పంట మీద రైతులు తక్కువ వడ్డీతో ప్లెడ్జి రుణం తీసుకునే ఏర్పాటు చేయాలి. లాభసాటి ధరకు ధరల స్థిరీకరణ నిధిని భారీస్థాయిలో ఏర్పాటు చేయటం దగ్గర్నుంచి, దళారీలు లేని రిటైల్ చెయిన్ల ఏర్పాటు, జాతీయస్థాయిలో ఎగుమతులు-దిగుమతుల విధానాన్ని సవరించేదాకా సమగ్ర ఏర్పాట్లు చేయాలి. ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరగటం వల్ల దేశవ్యాప్తంగా రైతులకు 2014 నుంచి వచ్చిన నష్టం ఏడాదికి రూ.1,40,000 కోట్లుకాగా.. అందులో తెలంగాణ అపరాల వాటా పెద్దఎత్తునే ఉంది. రాష్ట్రంలో మినుము, పెసర, కందుల ధరలు గత రెండేళ్లలో భారీగా పడిపోయాయి. అందుకే రైతుకు ఉచితాలు, రుణమాఫీలు కాకుండా రైతుకు ఆదాయం పెంచే విధానాల కోసం పార్టీల్ని డిమాండ్ చేయాలి.

**6) స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్ర బడ్జెట్ నుంచే తలసరి కేటాయింపు:**

స్థానికంగా మనం కట్టే పన్నుల డబ్బు, మన వనరుల్లో సగం వాటా స్థానికంగా మన దగ్గరే ఖర్చు చేసే ఏర్పాటుంటే.. మన గ్రామాలు, పట్టణాలు ఇంత అధ్వాన్నంగా ఉండవు, రాజధాని హైదరాబాద్‌లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం ఇంత ఘోరంగా ఉండవు. అందుకే కేంద్ర బడ్జెట్ నుంచి రాష్ట్రాలకు 50 శాతం నిధులు బదిలీ అవుతున్నట్టుగా.. రాష్ట్ర బడ్జెట్ నుంచి తలసరి కేటాయింపుతో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలకు బదిలీ కావాలి. 2018-19లో కేంద్ర బడ్జెట్ రూ.24,42,213 కోట్లుకాగా, రాష్ట్రాలకు రూ.12,69,435 కోట్లు బదిలీ అవుతున్నాయి. తెలంగాణ బడ్జెట్ 2018-19లో రూ.1,74,453.83 కోట్లు కాగా, తలసరి వ్యయం రూ.49,586. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు ఇస్తున్నది కేవలం రూ.32. అంటే తలసరి వ్యయంలో 0.1 శాతం కంటే తక్కువ. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇస్తున్నట్టే రాష్ట్ర బడ్జెట్‌లో నిర్దిష్టశాతం నిధుల్ని, కనీసం 25 శాతానికి తగ్గకుండా తలసరి లెక్కన స్థానిక ప్రభుత్వాలకు కేటాయించాలి. స్థానికంగా నిధుల్ని, అధికారాల్ని జవాబుదారీతనంతో బదిలీ చేయటం వల్ల వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య అనవసర ఖర్చులు తగ్గటంతోపాటు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. డబ్బు కళ్లెదురుగా అందరికీ అవసరమయిన మౌలిక సదుపాయాలకి, విద్య, ఆరోగ్యాలకి ఖర్చవుతుంటే, ఉచితాలు, తాయిలాలతో ప్రజలని మచ్చిక చేసుకునే అవసరం ఉండదు. అందుకే అధికార వికేంద్రీకరణ, స్థానిక సాధికారత ఈ ఎన్నికల్లో మన డిమాండ్ కావాలి. ❐

# మేధావులు ‘దివాంధులు’ కావద్దు

- టంకశాల అశోక్



**మనం 21వ శతాబ్దంలోకి ప్రవేశించిన తర్వాత తెలంగాణలో రెండు దశలు కన్పిస్తాయి.**

**2000 నుంచి 2014 వరకు మొదటిది. 2014 తర్వాతది రెండవది.**

**మొదటిది ఉద్యమ దశగా ఉన్నప్పుడు మేధావులు అధ్యయనాలు చాలానే చేశారు. అవన్నీ గొప్పవి అనలేముగాని తగినంతమంది ప్రయత్నాలు మాత్రం చేశారు.**

**రెండవ దశ వచ్చేసరికి ఈ ‘సంస్కృతి’ ఏమైంది?**

**నికరమైన, నికార్సయిన పరాన్నభుక్కులుగా జీవితాలను వృథా చేసుకుంటున్నవారితో తెలంగాణ నెమ్మదిగా ఒక మేధో ఎడారిగా మారుతున్నది. ఆత్మపరిశీలన చేసుకొని మారండని వారికి విజ్ఞప్తి చేయటం ఒక్కటే ఈ దశలో మిగిలిన విషయం.**

మేధావులు తమ సమాజంలో జరుగుతున్న మంచి చెడులు రెండింటిని కూడా అధ్యయనం చేయాలి. మంచిని ప్రోత్సహించాలి. చెడును ఎత్తిచూపాలి. అది మారేందుకు నిర్మాణాత్మక సూచనలు చేయాలి. ఇవన్నీ సమాజం దృష్టికి తీసుకెళ్లాలి. ఇందులో పాలకులు దేనినెట్లా స్వీకరించినా ప్రజల అవగాహనలు పెరుగుతాయి. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు వారే. తెలంగాణ మేధావులు ఈ విధమైన తమ పాత్రను ఎంతవరకు నిర్వర్తిస్తున్నారు? వారిలో కన్పిస్తున్నది అధిక భాగం అధ్యయనాలు లేకపోవటం, సినిసిజం, నెగెటివిజమే. ఇది విచారాన్ని కలిగిస్తున్న స్థితి.

మనం 21వ శతాబ్దంలోకి ప్రవేశించిన తర్వాత తెలంగాణలో రెండు దశలు కన్పిస్తాయి. 2000 నుంచి 2014 వరకు మొదటిది. 2014 తర్వాతది రెండవది. మొదటిది ఉద్యమ దశగా ఉన్నప్పుడు మేధావులు అధ్యయనాలు చాలానే చేశారు. అవన్నీ గొప్పవి అనలేముగాని తగినంతమంది ప్రయత్నాలు మాత్రం చేశారు. వారి స్ఫూర్తితో హైదరాబాద్ నుంచి కిందిస్థాయి వరకు మామూలు చదువులు చదివినవారు కూడా విషయ పరిశీలనకు ప్రయత్నించారు. అందులో లోతు ఉండకపోవచ్చు. కానీ గుర్తించవలసింది ఏమంటే ‘అధ్యయనం’ అన్నది మేధావుల నుంచి మామూలు చదువుల వారిదాకా ఒక ‘సంస్కృతి’గా మారింది. రెండవ దశ వచ్చేసరికి ఈ ‘సంస్కృతి’ ఏమైంది?

చాలావరకు బలహీనపడిపోయింది. మేధావులు అయినవారు తమ చుట్టూ అందుబాటులో ఉండే సమాచారాన్ని, సరిగ్గా, శ్రద్ధగా చదువటంతోపాటు, స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలనలు చేయాలి. సమాచారాలు అందుబాటులోకి అనేక విధాలుగా వస్తుంటాయి. అవి ప్రభుత్వం ద్వారా కావచ్చు, మీడియా నుంచి కావచ్చు, పలువురి నుంచి విన్నవి కావచ్చు, ప్రతిపక్షాల విమర్శల రూపంలో కావచ్చు. వీటిలో ఏది కూడా పూర్తి సత్యమో, పూర్తి అసత్యమో అయ్యే అవకాశం లేదన్నది మనకు ఇంగితజ్ఞానం చెప్పే మాట. ఈ విషయం సామాన్యుల కన్న మేధావులైన పరిశోధకులకు ఇంకా బాగా తెలుసు. అటువంటి స్థితిలో ఆయా సమాచారాల్లోని నిజానిజాలు తెలియగలది క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా మాత్రమే. లేదా అధమ పక్షంలో, భిన్న సమాచారాలను సరిపోల్చుతూ తమ వైపు నుంచి క్లిష్టమైన విచారణలు, విశ్లేషణలు చేయటం. పరిశోధనారంగంలో ఈ రెండు పద్ధతులను కూడా అనుసరిస్తుంటారన్నది తెలిసిన విషయమే. వీరిలో మొదటిది అత్యుత్తమం కాగా, రెండవది ఉన్నంతలో ఉత్తమం.

మొత్తం మీద, ఈ రూపాల్లో అధ్యయనాలు జరిపి అభిప్రాయాలను ప్రకటించటమే మేధావితనానికి గీటురాయి అవుతుంది. అటువంటి పని జరిగినప్పుడు అందువల్ల రెండు

విధాలైన మేళ్లు కలుగుతాయి. ప్రజలకు విషయాలపై తగిన దృక్పథం, అవగాహన ఏర్పడి వారు తమ అభిప్రాయానికి తాము స్వేచ్ఛగా రాగలగటం వాటిలో ఒకటి. మేధావులు జరిపే అటువంటి అధ్యయనాల ప్రేరణతో, మామూలు చదువుల వారు కూడా విషయాలను అదే పద్ధతిలో పరిశీలించేందుకు అలవాటుపడటం రెండవది. ఇటువంటివి ఎంతగా జరిగితే సమాజం, ప్రజాస్వామ్యం అంతగా పరిపుష్టమవుతాయి. ప్రజలు స్వేచ్ఛగా, చైతన్యంతో, సరైన ప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

2014 నుంచి తెలంగాణ రెండవ దశలోకి ప్రవేశించినప్పుడు, విషయాలు క్రమంగా ఈ దిశగా వెళ్లవచ్చునని ఒక ఆశ కలిగింది. లేదా వెళ్లాలనే కోరిక కలిగింది. మన జీవిత కాలంలోనే తెలంగాణకు ముందు మూడు రాష్ట్రాలు ఉద్యమాల ద్వారా ఏర్పడ్డాయి. అవి ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్. వీటిలో ముఖ్యంగా ఝార్ఖండ్ అయితే బ్రిటిష్ వలస పాలనపై సంతాలాలు తిరగబడినప్పటి నుంచి మొదలుకొని, స్వాతంత్ర్యానంతరం తమ సహజ వనరులను ఇతరులు కొల్లగొట్టి తమకు పేదరికాన్ని మిగల్చటంపై రకరకాల ఉద్యమాలు జరుపటం వరకు ఒక ఉజ్వలమైన చారిత్రక వారసత్వం గల ప్రాంతం. కాని కొత్త రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత అన్ని ఉద్యమ వారసత్వాలూ ఉఫ్‌మని ఊదిన దీపాల్లా ఆరిపోయాయి. మన ప్రస్తుత చర్చ మేధావుల పాత్ర గురించి అయినందున, అది కూడా అంతే నిరాశాజనకంగా మారింది. ఇప్పుడక్కడ అధ్యయనాలు జరుపుతున్న మేధావులు, ప్రజలకు వాటిని అందజేస్తున్నవారు ఒకచేతివేళ్లకు మించి ఉన్నట్లు లేరు. అదే నిస్పృహకరమైన వాతావరణం మేధావులు కాకుండా మామూలు చదువులు చదివిన వర్గాల్లోనూ వ్యాపించింది. అయినా, మేధావులు అనే వర్గీకరణలోకి వచ్చేవారి పరిస్థితే ఆ విధంగా ఉన్నప్పుడు ఇతరులను నిందించబూనటం అవివేకమవుతుంది.

మేధావులు ఏవో ఉద్యమాలు చేయాలని ఇక్కడ ప్రత్యేకంగా అనటం లేదు. పైన పేర్కొన్న మూడు రాష్ట్రాల్లో ఒక అధ్యయన సంస్కృతిని, ప్రజాస్వామిక చైతన్యాన్ని సృష్టించే కనీస పాత్ర నుంచి కూడా వారు తప్పుకున్నారు. అదొక పెద్ద విషాదం. ఆ స్థితితో పోల్చినప్పుడు తెలంగాణలో ఏం జరుగుతున్నది? యథాతథంగా పరిపాలనాపరంగా, సామాజికంగా అనేకం కన్పిస్తున్నాయి. పరిపాలనను చూసినప్పుడు మెరుగుపడుతున్న లక్షణాలు, క్షీణిస్తున్న ధోరణులు. గతంలో లేనివిధంగా వస్తున్న రకరకాల హీనసంస్కృతులు. బలహీనపడటమే కాకుండా వికృతంగా మారుతున్న కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, నైతికతలు. వ్యక్తిగత నైతికతా రాహిత్యాలు సామూహిక నైతికతా రాహిత్యాలుగా మారుతూ భయం గొలుపుతుండటం.

వీటన్నింటి మధ్య తెలంగాణ మేధావులు ఏం చేస్తున్నారు? పరిపాలన గురించి గాని, సామాజిక ధోరణుల గురించి గాని అందుబాటులో గల సమాచారాలను సరిగా, శ్రద్ధగా చదువుతున్నారా? అంతకుమించిన సమాచారాల కోసం పట్టణాలలోని, గ్రామాలలోని సమాజం వద్దకు కూడా ఏమైనా వెళుతున్నారా? తాము నేర్చిన వివిధ అకడమిక్ థియరీలు, సిద్ధాంతాలు, చదివిన లోకజ్ఞానాల వెలుగులో వాటినేమైనా పరిశీలిస్తున్నారా? క్లిష్టమైన దృష్టితో విశ్లేషించి సామాజికులకు తెలియజెప్తున్నారా? మినహాయింపులు కొద్దిగా ఉండవచ్చుగాని అధిక సంఖ్యాకులు ఇదేమీ చేయటం లేదు. ఇటు పరిపాలనలో, అటు సమాజంలో ఏమి జరుగుతున్నదో తెలుసుకునేందుకు వారిలో అధికులు అసలు పత్రికలు సరిగా చదువటం లేదు. వార్తలు పైపైన చూస్తారు. అప్పటికే తమకు గల అభిప్రాయాలతో కలిపిచూసి ఒక తుది అభిప్రాయానికి వచ్చి వేస్తారు. ఒకటికి మించిన పత్రికలతో పోల్చిచూడటం ముఖ్యమైన పరిణామాలకు సంబంధించి కూడా ఉండదు. తమకు తమ ఉద్యోగాలు, ఇతర పనులు ఉంటాయి గనుక ఇదంతా మరీ కూలంకషంగా వీలు కాదని ఒప్పుకోవచ్చు. కాని ముఖ్యమైన విషయాల్లోనైనా అటువంటి పనిని ఒక విధంగా చేయటం మేధావులుగా వారికి గల తప్పనిసరి బాధ్యత.

విచిత్రమేమంటే ఇదంతా తమ బాధ్యత అని వారు అనుకోవటమైనా లేదు. ఆ బాధ్యతలో భాగంగా ఏమేమీ తెలుసుకొని, ఏ విధంగా అధ్యయనాలు జరిపి, సమాజానికి ఏమేమి అవసరమో తెలుసుకుని, ఆ విధంగా అధ్యయనాలు జరిపి, సమాజానికి ఏ విధంగా చేరవేయాలనే ఆలోచన, ప్రణాళిక ఏవీ వారికి లేవు. అది ఉంటే, అవి చేయనందుకు ఆ లోపాన్ని తమకు తాము గుర్తించుకునేవారు. అటువంటి లోపంతో వ్యవహరిస్తున్నందుకు తమను తాము దోషులుగా భావించుకునేవారు. అటువంటి గుర్తింపు, భావన గలవారు ఆ స్థితి నుంచి బయటపడేందుకు ఏదో ఒకరోజు, ఎంతో కొంత ప్రయత్నాన్ని పశ్చాత్తాపంతో ఆరంభిస్తారు.

ఇక వీరి క్షేత్రస్థాయి పరిశీలన గురించి అయితే మాట్లాడకపోవటం మంచిదేమో. ఆర్థిక వనరులకు, సమయానికి కొరత ఏమీ లేకున్నా ఈ తరహా మేధావి వర్గాలకు వాటితో జీవితానందాలను అనుభవించటం మినహా, వాస్తవాలను కనుగొని అధ్యయనం చేయకుండా యధేచ్ఛగా తమ అజ్ఞానాన్ని, బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శించటాన్ని కూడా అటువంటి జీవితానందంలో ఒక భాగంగా తీసుకోవటం తప్ప వీరు మరొకటి చేస్తున్నట్టు కన్పించదు. ఈ విధంగా నికరమైన, నికార్సయిన పరాన్నభుక్కులుగా జీవితాలను వృథా చేసుకుంటున్నవారితో తెలంగాణ నెమ్మదిగా ఒక మేధో ఎడారిగా మారుతున్నది. ఆత్మపరిశీలన చేసుకొని మారండని వారికి విజ్ఞప్తి చేయటం ఒక్కటే ఈ దశలో మిగిలిన విషయం. ❐

(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)

# భావదారిద్ర్య రేఖకి దిగువన కొట్టుమిట్టాడుతున్న రాజకీయనేతలు

- శ్రీరమణ




మనకి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 'ఎన్నికల వాగ్దానాలకి' ఒక ప్రత్యేకమైన ప్రతిపత్తి ఉంది. ఆ వాగ్దానాలు కార్యరూపం దాల్చడానికి ఎంత అవకాశం ఉంటుందో, కాకపోవడానికి అంతకు మూడు రెట్లు అవకాశం ఉంటుంది. స్వతంత్రం వచ్చీ రాకుండానే నెహ్రూ ప్రతిపాదించిన పంచవర్ష ప్రణాళికలు హాస్యాస్పదంగానూ, ఓ సామెతగానూ మిగిలాయి.

శంకుస్థాపన శిలాఫలకాల మీద బోలెడు సెటైర్లు, కావల్సినన్ని కార్టూన్లు వస్తుండేవి. అమలుకాని వాగ్దానాలు, శుష్కప్రియాలు, తీపికబుర్లు– ఇలాంటివన్నీ కలిసిపోయాయి. అవే రంగు మార్చుకుని మానిఫెస్టోలు అయినాయి. ఇందిరాగాంధీ 'గరీబీహటావో' దేశాన్ని పదేళ్లపాటు నిరాటంకంగా పాలించింది. తర్వాత ఎవరెవరో ఎన్నెన్నో ఏకపద, ద్విపద నినాదాలు రచించారు. కానీ అవి జనానికి ఎక్కలేదు.

ఇవి కూడా వ్యాపార ప్రకటనల్లాంటివే. రూలర్‌కి, ఓటర్‌కి నడుమ వారధిలా ఉండాలి. ఆ రెండు ముక్కలూ మంత్రాక్షరిలా పనిచేయాలి. 'ఓన్లీ విమల్' అనే రెండు మాటలు కష్టమర్లని పట్టేసింది. తెగ చుట్టేసింది.

'ఐ లవ్ యూ రస్నా' పిల్లల్నే కాదు పెద్దల్ని కూడా నోరూరిస్తుంది. ఒక ఫోమ్ పరుపుల కంపెనీ మీకు అత్యంత నమ్మకమైన స్లీపింగ్ పార్టనర్ అనే విశేషం తగిలించి జనాన్ని తెగ ఆకర్షించింది.

ఈ రాజకీయ వార్తావరణంలో నిత్యం సంగతులు వింటుంటే సగటు ఓటర్లకి హాస్యాస్పదంగా తోస్తోంది. జన సామాన్యానికి ఏమేమీ ఆశలు పెడితే ఓట్లు రాలుతాయో అంతుపట్టడం లేదు. ధనిక వర్గాన్ని పడగొట్టడం మాటలు కాదు. పేద, బలహీన వర్గాలను మాటల్తో హిప్నటైజ్ చేయడం తేలికేనని రాజకీయ పార్టీలన్నీ గట్టిగా నమ్ముతాయ్. పాపం, వేరే దిక్కులేక ఆ వర్గాలు పదే పదే నమ్మేసి నాలిక్కరుచుకుంటూ ఉంటాయి. ఎలుగుబంటి, నక్క కథలో లాగా అన్నిసార్లూ నక్కే లాభం పొందినట్టు రాజకీయమే చివరకు నెగ్గుతూ ఉంటుంది.

ఎలుగు, నక్క ఉమ్మడి వ్యవసాయానికి దిగుతాయి. పై పంట నాది, మధ్య మొదటి పంటలు నువ్ తీసుకో అంది నక్క. ఆ సంవత్సరం వరి పంట వేస్తే ఎలుగుకి గడ్డి మిగిలింది. నక్కకి ధాన్యం దక్కింది. ఎలుగు మరు సంవత్సరం తెలివిగా ఈసారి పై పంట నాది అన్నది. సరేనని ఆ ఏడు వేరుశెనగ వేస్తే, మళ్లీ నక్క పంటే పండింది. మూడో ఏడు కోరుకునే ఛాన్స్ నక్కకి వచ్చింది. మధ్యపంట నాకిచ్చి, తుది మొదలు నువ్వు తీసుకోమంది. ఆ సంవత్సరం చెరకుతోట వేసింది. ఎలుగుకి ఆకులు, వేర్లు దక్కాయి.

మన లీడర్లు బహిరంగంగానే ఏ మాటలతో ఓట్లు రాల్తాయో ఆలోచన చేస్తుంటే భలే ఆశ్చర్యం వేస్తుంది. పైగా 'మేం చేస్తాం, మేం ఇస్తాం' అని వాగ్దానాలు చేస్తుంటే మరీ అగ్గెత్తుకొస్తుంది. వాళ్ల సొంతసొత్తు తీసి పంచుతామన్నట్టు మాట్లాడతారు. జనం డబ్బు, జనం కోసం ఖర్చు చేయడం కూడా మహా త్యాగంలా చెబుతారు.

పైగా రాబడికి పోబడికి మధ్య ఎన్ని వేల కోట్లు తరుగు పోతుందో ఒక్కసారి సామాన్యులు సుమారు లెక్కవేసినా గుండె పగులిపోతుంది.

ఈ దేశభక్తికి ప్రజాసేవకి ఎందుకింత డిమాండు ఉందో తేటతెల్లం అవుతుంది. ఇటీవల నినాదాలు వింటుంటే కనీసం మాటల్లోనైనా కొత్త ఐడియాలు అస్సలు లేవు. "ఛానల్ లోగో కప్పేస్తే అన్ని తెరలూ ఒకేలా ఉంటున్నాయ్. పత్రికల పైతల కొట్టేస్తే అన్ని డైలీలు ఒకటే"నని ఓ పెద్దమనిషి చిరాకుపడ్డాడు.

నాకు గుర్తొస్తోంది, చాలా రోజుల క్రితం ఒక పత్రికలో ఒక వ్యాపార ప్రకటన వచ్చింది. 'మిగిలిన పత్రికలు చదివి మోసపోకండి! మా పత్రికనే చదవండి' అని. జనం ఔరా అని ముక్కున వేలేసుకున్నారు.

మీరు ఇంతవరకూ నష్టపోయింది చాలు. డబ్బు వీజీగా రాదని ఓ శ్రేయోభిలాషి మనల్ని నిమిషానికోసారి దిగులు పడేట్టు చేస్తుంటాడు. పార్టీ నినాదాలు కూడా సినిమా పల్లవుల్లా 'క్యాచీ'గా ఉండాలి. ప్రస్తుతం మన రాజకీయ నేతలందరూ భావదారిద్ర్య రేఖకి దిగువన కొట్టుమిట్టాడుతున్నారు. పాపం! వారిని ఉద్ధరించండి! ❐

(కర్టెసీ: సాక్షి)

# దారితప్పిన ధర్మపోరాట దీక్ష



ప్రధానమంత్రి మోదీ, బీజేపీ నేతలు చేసిన రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని ఎదిరించేందుకు కేంద్రంపై ఫెడరల్ స్ఫూర్తితో సంకల్పించిన ధర్మపోరాట దీక్ష దారితప్పిందని, చివరకు దాన్ని తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారసభలాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్చేశారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా రాజకీయ పక్షాల్ని, పౌర సమాజాన్ని, మేధావుల్ని కూడగట్టటంలో బాబు విఫలమయ్యారన్నారు. కేంద్రంలో మోదీలాగే రాష్ట్రంలో చంద్రబాబు తయారయ్యారని, వ్యవస్థల్ని కుప్పకూలుస్తూ అధికారమంతా తన చుట్టూనే కేంద్రీకరించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శులు చేస్తున్న విమర్శలను ఎద్దేవా చేయటం కాకుండా సరైన జవాబు చెప్పాలన్నారు. విజయనగరం జిల్లాకు ఇచ్చిన 10 హామీల్ని, ఉత్తరాంధ్రకు ఇచ్చిన 35 హామీల్ని నెరవేర్చలేదని, వైద్య కళాశాల కోసం ఎమ్మెల్యేలు గట్టిగా వత్తిడి తేవాలని బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. హామీల వివరాల్ని విడుదల చేశారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు నాగభూషణం, రాజారావు, గురునాథరావు, భాస్కర్, చంద్రరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

### 'సిట్' నివేదిక అబద్ధాల పుట్ట

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విశాఖ భూకుంభకోణం కేసును ప్రభుత్వం నీరుగార్చిందని బాబ్జీ అన్నారు. కొండను తవ్వి ఎలకను కూడా పట్టలేదన్నారు. సూత్రధారులైన నేతలను వదిలి పాత్రధారులైన అధికారుల మీద మాత్రమే ఉచ్చు బిగించాలని చూస్తున్నారన్నారు. కుంభకోణంలో తమ పార్టీ మంత్రి, ఎమ్మెల్యేల పాత్ర ఉందని తెదేపా సీనియర్ మంత్రి అయ్యన్న పాత్రుడు బహిరంగంగానే అంగీకరించారన్నారు. అక్రమాల్లో రాజకీయ శక్తుల పాత్ర ఉందని లోక్‌సత్తా తరపున తాము కూడా సాక్ష్యాధారాలను 'సిట్' చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్‌కి గత జూన్‌లో ఫిర్యాదులు అందించామన్నారు. దీనిపై ఉన్నతస్థాయి న్యాయవిచారణ జరిపించాలన్నారు.

# నాణ్యమైన విద్య లేకుండా.. తెలంగాణలో నూతన సామాజిక అసమానతల్ని ఎలా అరికట్టగలం?



రేగట్టే వెంకట్ రెడ్డి
సామాజిక కార్యకర్త

**పుట్టిన ప్రతి బిడ్డా తనలోని సామర్థ్యాలను వికసింప చేసుకుని వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలను అందుకోవటానికి నాణ్యమైన విద్యే ప్రధాన మార్గం. అలాంటి విద్యలో తెలంగాణ రాష్ట్రం ఎంత అధ్వాన్నంగా ఉందో, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటును మంచి ప్రమాణాల చదువు వంటి ఎజెండా కోసం వినియోగించుకోవటం ఎంత అవసరమో తెలియజెప్పే వ్యాసమిది.**

విద్యాహక్కు చట్టం 2010 ప్రకారం నాణ్యమైన విద్యతో బాలల సర్వతో ముఖాభివృద్ధి జరగాలని, బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందాలని, బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తులు అభివృద్ధి చెందాలని, పిల్లలను కేంద్రం చేసుకుని వారికి అనువైన విధానాల్లో కృత్యాలు, పరిశోధన, కను గొనడం ద్వారా నేర్చుకునేలా చూడాలని, జ్ఞానాన్ని బాలలు అర్థం చేసుకున్న విధానం, దానిని అన్వయించే సామర్థ్యంపై నిరంతర మూల్యాంకనం జరపాలని, భయం, ఆందోళన వంటి వాటి నుంచి బాలలను విముక్తం చేసేవారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడం కోసం సహాయ పడాలని చట్టం ప్రభుత్వాలను ఆదేశిస్తుంది. పాఠశాలల్లో విద్యనందు కుంటున్న పిల్లలకు వారి తరగతులకు తగిన విద్యాసామర్థ్యాలు లేని పక్షంలో, ప్రత్యేక శిక్షణనందించి, అదనపు బోధనతో, వారి తరగతులకు తగిన స్థాయి నందించా లని విద్యాహక్కు చట్టం చెబుతుంది.

విద్యాహక్కు చట్టంలో నాణ్యమైన విద్య



బాలల హక్కు అయినందున జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రం-2005 ఆధారంగా అభ్యాసన ఫలితాలను తెలంగాణ రాష్ట్రంలో ఎన్.సి.ఇ.ఆర్.టి తరగతివారిగా పాఠ్యప్రణాళికను రూపొందించింది. దీన్ని బట్టి ఉదాహరణకు అయిదవ తరగతి పూర్తి చేసిన పిల్లలకు తెలుగులో ఆశించిన అభ్యాసన ఫలితాలు ఒకసారి పరిశీలించితే ఇతరుల ద్వారా తెలుసుకొన్న విషయాలపై స్పందిస్తారు, ప్రశ్నిస్తారు. విన్న, చదివిన విషయాలు, సంఘటనలు, చిత్రాలు, పాత్రలు, శీర్షికలు మొదలగు విషయాలపై మాట్లాడుతారు, ప్రశ్నిస్తారు, అభిప్రాయాలు చెప్తారు, తగిన కారణాలు వివరిస్తారు. కథలు, కవితలు, గేయాలు మొదలగు వాటిని అర్థం చేసుకొని వాటికి తమ మాటలను/పదాలను చేరుస్తారు లేదా పొడిగించ గలుగుతారు. భాషాంశాలలోని వివిధ అంశాలను గుర్తించి వాక్య నిర్మాణం చేస్తారు. సందర్భానుసారంగా ఉపయోగిస్తారు. వార్తాపత్రికలలోని ముఖ్య శీర్షికలు, బాలల పత్రికలూ, వివిధ రచనలు మొదలగు అంశాలను అర్థం చేసుకొంటారు. వాటి గురించి చర్చిస్తారు. నివేదిక రూపంలో రాస్తారు. తాము చదివిన రచనలు, దైనందిన జీవిత అనుభవాల ద్వారా తెలుసుకున్న విషయాల ద్వారా వచ్చిన ఆలోచనలను తమ మాటల్లో/లేఖన రూపంలో వ్యక్తపరుస్తారు. పాఠ్య/పాఠ్యేతర విషయాలు (బాల సాహిత్యం, వార్తాపత్రికల ముఖ్య శీర్షికలు, బాల పత్రికలూ, హోర్డింగ్స్ మొదలగునవి) అర్థం చేసుకొంటూ

చదువుతారు. వివిధ రచనలలోని కొత్త పదాలను అర్థం చేసుకొని వివిధ సందర్భాలలో తామూ ప్రయోగిస్తారు (మౌఖిక/లిఖిత). చదువడానికి ఉత్సాహాన్ని చూపుతారు (గ్రంథాలయం, చదివే చోటు (రీడింగ్ కార్నర్) మొదలగు ప్రదేశాల నుండి తమకు నచ్చిన పుస్తకాలను ఎన్నుకుంటారు). తమ స్థాయి/అభిరుచికి అనుగుణంగా ఇతర విషయాలు, వృత్తులు, కళలు మొదలగువాటికి (ఉదాహరణకు: పర్యావరణం, సంగీతం, వ్యవసాయం మొదలగునవి) సంబంధించిన పదజాలాన్ని ప్రశంసిస్తారు. తాము చేసే రచనలలో సందర్భానుసారంగా పదాలను ఉపయోగిస్తారు, పోల్చుకొంటారు, ప్రశంసిస్తారు (ఉదా: జాతీయాలు, సామెతలు, పదబంధాలు మొదలగునవి). వివిధ ఉద్దేశాల కొరకు సందర్భానుసారం రాస్తారు (ఉదా: బులెటిన్ బోర్డులోని సమాచారం, వస్తుసామాగ్రి సూచీ). తమ రాతలో మార్పులు, చేర్పులు చేసుకొంటారు. రాస్తున్న ఉద్దేశం ప్రకారం, పాఠకులను అనుసరించి అందుకు తగిన ప్రక్రియను ఎన్నుకొని రాస్తారు. విరామ చిహ్నాలను ఉపయోగిస్తూ రాస్తారు. తమలోని సృజనాత్మక శక్తిని, కల్పనా శక్తిని, కథలు, కవితలు, ఆత్మకథలు, సంభాషణలు మొదలగు ప్రక్రియలల్లో మౌఖిక/లిఖిత రూపాలలో వ్యక్తపరుస్తారు.

మన తెలంగాణ రాష్ట్రంలో అయిదవ తరగతి పూర్తి చేసి ఆరవ తరగతిలో ఉన్న పిల్లలు కాదు కదా 10వ తరగతి చేరిన విద్యార్థులు కూడా పై అభ్యాసనాలకు చాలా దూరంగా ఉన్నారనే విషయాన్ని మనం ముందుగా ఒప్పుకోవాలి. పిల్లల చదువుకు సంబంధించిన రాజ్యాంగ హామీల అమలులో ప్రభుత్వాలు ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదని తెలుస్తుంది. ఈ పరిస్థితిని చూసి వివిధ సంఘాలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు విద్యాసామర్థ్యాలను బేరీజు వేయడానికి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి 'విద్యాసామర్థ్యాల ఉద్యమం' అనే సంఘాన్ని ఏర్పరిచారు. ఈ ఉద్యమ సంఘం ఆధ్వర్యంలో విద్యాసామర్థ్యాలపై ఒక సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగింది.

**విద్యాసామర్థ్యాల సామాజిక పరిశీలన:**

ఈ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విద్యాసామర్థ్యాల ఉద్యమం ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొమ్మిది జిల్లాల్లో- సూర్యాపేట, యాదాద్రి, నల్గండ, రంగారెడ్డి, వికారాబాద్, జోగులాంబ గద్వాల్, నాగర్‌కర్నూల్, సిద్దిపేట్, హైదరాబాద్ జిల్లాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో పెద్దఎత్తున పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గని పిల్లల స్థాయి నిర్ధారణ నిర్వహించడం జరిగింది. ఈ స్థాయి నిర్ధారణలో ప్రభుత్వ, ప్రైవేట్ బడులలో 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 1302 విద్యార్థులు పాల్గొన్నారు.

**1302 మంది పిల్లల్లో 533 మందికి తెలుగు, గణితం, ఇంగ్లీషు చదవడం, రాయడం రాదు. 525 మంది పిల్లలు సరళ, గుణింత పదాలతో కూడిన వాక్యాలు, కూడికలు, తీసివేతలు, గుణకారాలు చేయగలరు, ఇంగ్లీషులో వాక్యాలు చదవగలరు. కేవలం 244 మంది పిల్లలు మాత్రమే తెలుగు, గణితం, ఇంగ్లీష్ చదవగలరు, రాయగలరు.. ఇది మూడవ తరగతి సామర్థ్యాలకు సంబంధించిన మూల్యాంకనం మాత్రమే. ఇక తరగతివారిగా రావలసిన సామర్థ్యాలు చూస్తే పరిస్థితి ఇంకా ఆందోళనకు గురిచేస్తుంది.**

సబ్జెక్టువారిగా మూల్యాంకన పత్రాలను పరిశీలించగా, దిగ్భ్రాంతికరమైన, బాధను కలిగించే అంశాలు బయటపడ్డాయి.

**తెలుగు:** 489- మంది పిల్లలు సరళ, గుణింత పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు. బొమ్మలను చూసి కూడా పదాలు రాయలేకపోయారు. 440- మంది పిల్లలు ద్విత్వ, సంయుక్త పదాలు రాసినా గుణింతాలతో కూడిన వాక్యాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు. 10వ తరగతి పిల్లలు 156 మందికి 86 మంది మాత్రమే పై పదాలను చదివారు, రాయగలిగారు. 373- మంది పిల్లలు మాత్రమే తెలుగు పేపరు చదవగలిగారు, రాయగలిగారు.

**గణితం:** 732- మంది పిల్లలు కూడికలు, తీసివేతలు చేయలేకపోయారు. 1 నుండి 100 సంఖ్యలను లెక్కబెట్టడం, ముందు సంఖ్య తరువాత సంఖ్యను గుర్తుపట్టడం, రాయడం చేయలేకపోయారు. 249- మంది పిల్లలు కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు చేయగలిగారు. 321- మంది పిల్లలు పూర్తిగా రాత లెక్కలు చేయలేకపోయారు. 10వ

తరగతి పిల్లలు 170 మందికి 92 మంది పిల్లలు రాత లెక్కలు చేయలేకపోయారు. తెలుగు చదవగలిగిన పిల్లలు కూడా రాత లెక్కలు చేయలేకపోయారు.

**ఇంగ్లీష్:** 650- మంది పిల్లలు ఇంగ్లీష్ పదాలు చదవడం, రాయడం చేయలేకపోయారు. 381- మంది పిల్లలు వాక్యాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు. 271- మంది పిల్లలు మాత్రమే వాక్యాలు చదవగలిగారు, కానీ పేరాగ్రాఫ్ చదవలేకపోయారు.

విద్యార్థులు తమ తరగతుల స్థాయికన్నా అతి తక్కువ స్థాయిలో ఉండడం నిజంగా చాలా బాధాకరంగా తోచింది. చాలామంది విద్యార్థులు చిన్న చిన్న బొమ్మలు చూసి వాటి పేర్లను రాయలేకపోయారు. ద్విత్వాక్షరాలతో వచ్చే పదాలను అయితే రాయడంలో చాలా ఇబ్బంది పడ్డారు. వత్తులు లేని సరళ పదాలతో కూడిన చిన్న చిన్న వాక్యాలను చదువలేకపోయారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ పిల్లలు బడులకు వస్తూనే ఉన్నారు. వీరి మూల్యాంకనలు చేస్తూనే ఉన్నారు. కానీ వీరి సామర్థ్యాలను పెంచడంలో మన విద్యావ్యవస్థ పూర్తిగా విఫలమైందనే చెప్పాలి.

ఇక తరగతులవారీగా చూస్తే

**5వ తరగతి 157 మంది పిల్లలు**

**తెలుగు:**

99- మంది పిల్లలు సరళ, గుణింత పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు. 48- మంది పిల్లలు సరళ, గుణింత పదాలు, ద్విత్వ, సంయుక్త పదాలు చదివి గుణింతాలతో ఉన్న వాక్యాలు చదవలేకపోయారు.

ఇందులో 24 మంది పిల్లలు కంప్యూటర్, గొడ్డలి అనుపాదాలు బొమ్మలు చూసి రాయలేకపోయారు, మధ్యప్రదేశ్ అన్న పదం చదవలేకపోయారు.

10- మంది పిల్లలు గుణింతాలతో కూడిన పేరాగ్రాఫ్ చదవగలిగినా, చదివి అర్థం చేసుకుని రాయలేకపోయారు.

**గణితం:**

94- మంది ఎటువంటి లెక్కలు చేయలేకపోయారు.

61- మంది పిల్లలు కూడికలు, తీసివేతలు, గుణకారాలు చేయగలిగినా, భాగాహార లెక్కలు చేయలేకపోయారు.

02- వీరు మాత్రమే కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహార లెక్కలు చేయగలిగారు. కానీ రాత లెక్కలు చేయలేకపోయారు.

**ఇంగ్లీష్:**

103- మంది పిల్లలు ఇంగ్లీష్ పదాలు కూడా చదవడం, రాయడం చేయలేకపోయారు.

42- మంది పిల్లలు పదాలు చదవగలిగారు, బొమ్మలను చూసి రాయగలిగారు.

12- మంది మాత్రమే వాక్యాలు చదవగలిగారు. ఎవరూ కూడా పూర్తిగా పేరాగ్రాఫ్ చదవలేకపోయారు.

**6వ తరగతి 239 మంది పిల్లలు**

**తెలుగు:**

128- మంది పిల్లలు సరళ, గుణింత పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు.

83- మంది పిల్లలు సరళ, గుణింత పదాలు, ద్విత్వ, సంయుక్త పదాలు చదివి గుణింతాలతో ఉన్న వాక్యాలు చదవలేకపోయారు.

28- మంది పిల్లలు గుణింతాలతో కూడిన పేరాగ్రాఫ్ చదవగలిగినా, పేరాగ్రాఫ్ చదివి సొంతంగా రాయలేకపోయారు.

**గణితం:**

145- మంది పిల్లలు కూడికలు, తీసివేతలే కాకుండా 1 నుండి 100 వరకు ఉన్న సంఖ్యలలో చిన్న సంఖ్య, పెద్ద సంఖ్య తరువాత సంఖ్య నుంచి లిఖించడం రావడం లేదు.

79- మంది పిల్లలు కూడికలు, తీసివేతలు, గుణకారాలు మాత్రమే చేయగలిగారు.

15- మంది పిల్లలు సంఖ్యలలో భాగాహార లెక్కలు చేయగలిగి, రాతలెక్కల్లో కూడికలు, తీసివేతలు మాత్రమే చేయగలిగారు. పూర్తి రాతలెక్కలు చేయలేకపోయారు.

**7వ తరగతి 270 మంది పిల్లలు**

**తెలుగు:**

101- మంది పిల్లలు సరళ, గుణింత పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు.

98- మంది పిల్లలు గుణింతాలు ఉన్న పేరాగ్రాఫ్ చదవగలిగారు. కానీ సంయుక్త పదాలు రాయలేకపోయారు, చదవలేకపోయారు.

71- మంది పిల్లలు సొంతంగా మూడు లైన్ల వాక్యాలు రాయలేకపోయారు. కానీ పేరాగ్రాఫ్ చదవగలిగారు.

**గణితం:**

115- మంది 1 నుండి 100 వరకు సంఖ్యలను లెక్కబెట్టడం, కూడికలు, తీసివేతలు చేయలేకపోయారు.

134- మంది పిల్లలు గుణకారాలు, భాగాహారాలు సంఖ్యలలో చేయగలిగారు.

21- మంది పిల్లలు సంఖ్యలలో చేయగలిగినా, రాతలెక్కలు పూర్తిగా చేయలేకపోయారు.

**ఇంగ్లీష్:**

142- మంది పిల్లలు ఇంగ్లీష్ పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు.

86- మంది పిల్లలు వాక్యాలు చదివారు కానీ రాయలేకపోయారు.

42- మంది పిల్లలు పేరాగ్రాఫ్ చదవగలిగారు.

**8వ తరగతి 259 మంది పిల్లలు**

**తెలుగు:**

95- మంది పిల్లలు సరళ, గుణింత పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు.

86- మంది పిల్లలు సంయుక్త పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు. కానీ గుణింతాలతో ఉన్న పేరా చదివారు.

78- మంది పిల్లలు గుణింతాలతో కూడిన పేరాగ్రాఫ్ చదవగలిగినా, చదివి అర్థం చేసుకుని రాయలేకపోయారు.

**గణితం:**

103- మంది పిల్లలు 1 నుండి 100 వరకు సంఖ్యలను లెక్కపెట్టటం, కూడికలు, తీసివేతలు చేయలేకపోయారు.

116- మంది గుణకారాలు, భాగాహారాలు సంఖ్యలలో చేయగలిగారు.

40- మంది పిల్లలు సంఖ్యలలో చేయగలిగిన రాతలెక్కలు పూర్తిగా చేయలేకపోయారు.

**ఇంగ్లీష్:**

130- మంది పిల్లలకు ఇంగ్లీష్ రాదు, పదాలు కూడా కరెక్టుగా రాయలేకపోయారు, చదవలేకపోయారు.

70- మంది పిల్లలు వాక్యాలు చదవగలిగినా, రాయలేకపోయారు.

59 మంది- పేరాగ్రాఫ్ చదవలేకపోయారు.

**9వ తరగతి 221 మంది పిల్లలు**

**తెలుగు:**

50 మంది- పిల్లలు సరళ, గుణింత పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు. ఎక్కువమంది పిల్లలు టామాటా, కాషాయం అనే పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు.

82- మంది సంయుక్త పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు. కానీ గుణింతాలతో ఉన్న పేరా చదివారు.

ఇందులో ఎక్కువమంది పిల్లలు సంస్కృతం, గొడ్డలి, కంప్యూటర్ అను పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు.

89- మంది పిల్లలు గుణింతాలతో కూడిన పేరాగ్రాఫ్ చదవగలిగినా, చదివి అర్థం చేసుకుని రాయలేకపోయారు.

**గణితం:**

72- మంది పిల్లలు కూడికలు, తీసివేతలు చేయలేకపోయారు.

105- మంది గుణకారాలు, భాగాహారాలు చేయగలిగారు.

44- మంది పిల్లలు సంఖ్యలలో భాగాహారాల వరకు చేయగలిగినా, రాతలెక్కలు చేయలేకపోయారు.

**ఇంగ్లీష్:**

95- మంది పిల్లలకు ఇంగ్లీష్ రాదు, పదాలు కూడా కరెక్టుగా రాయలేకపోయారు, చదవలేకపోయారు.

69 మంది- వాక్యాలు చదవగలిగినా, రాయలేకపోయారు. ఇందులో గర్ల్స్ అనే పదం రాయలేకపోయారు.

57- మంది పిల్లలు వాక్యాలు చదవగలిగి, పేరాగ్రాఫ్ చదవగలిగారు.

**10వ తరగతి 156 మంది పిల్లలు**

**తెలుగు:**

20- మంది పిల్లలు సరళ, గుణింత పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు.

ఇందులో కూడా కాషాయం, కోడి అనే పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు.

41- మంది సంయుక్త పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు. కానీ గుణింతాలతో ఉన్న పేరా చదివారు.

ఇందులో మధ్యప్రదేశ్, సంస్కృతం, గొడ్డలి అనే పదాలు చదవలేకపోయారు, రాయలేకపోయారు.

95- మంది పిల్లలు పేరాగ్రాఫ్ చదవగలిగినా సొంతంగా పేరాగ్రాఫ్ రాయలేకపోయారు.

**గణితం:**

29- మంది పిల్లలు కూడికలు, తీసివేతలు చేయలేకపోయారు.

67- మంది గుణకారాలు, భాగాహారాలు చేయగలిగారు.

60- మంది పిల్లలు పూర్తిగా రాతలెక్కలు చేయలేకపోయారు.

**ఇంగ్లీష్:**

47- మంది పిల్లలకు ఇంగ్లీష్ రాదు, పదాలు కూడా కరెక్టుగా రాయలేకపోయారు, చదవలేకపోయారు.

38- మంది వాక్యాలు చదవగలిగినా, రాయలేకపోయారు.

71- మంది పిల్లలు వాక్యాలు చదవగలిగినా, పేరాగ్రాఫ్ చదవలేకపోయారు.

2016 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు కనీస విద్యాసామర్థ్యాల సాధన, ప్రగతి గురించి బేరీజు వేయడానికి రాష్ట్రస్థాయి మానిటరింగ్ బృందాలను ఏర్పాటు చేయటం జరిగింది. ఈ బృందాలు మొత్తం రాష్ట్రంలోని 1368 పాఠశాలలను పరిశీలించి ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం కూడా 48 శాతం ప్రాథమిక, 46 శాతం ప్రాథమికోన్నత, 42 శాతం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కనీస సామర్థ్యాలు, ముఖ్యంగా తెలుగు చదవడం రాయడం రాదని తేల్చి చెప్పింది. రాష్ట్రంలో మన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి కనీస సామర్థ్యాలైన చదవడం, రాయడంలో ఎంత వెనుకబడి ఉన్నారో ఈ నివేదిక ద్వారా కూడా మనకు అర్థమవుతుంది. అంతే కాకుండా 2017 సంవత్సరంలో ఎన్.సి.ఈ.ఆర్.టి ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి నివేదిక కూడా సగం మంది పిల్లలకు విద్యాసామర్థ్యాలు లేవని తేల్చిచెప్పింది.

చదవడం, రాయడం రాని పిల్లలకు ప్రతి విద్యాసంవత్సరం 3 ఆర్ (రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్) కార్యక్రమం చేపట్టినా ఈ కార్యక్రమం ఆశించినంత ఫలితాలు ఇవ్వడం లేదని తెలుస్తోంది. శిక్షణ పొంది లక్షల మందితో పోటీపడి నెగ్గిన ఉపాధ్యాయులు, రాష్ట్ర స్థాయి నుండి పాఠశాల వరకు ఎంతో అనుభవమున్న విద్యాయంత్రాంగం ఈ పిల్లలకు సంవత్సరాలుగా అదే పనిగా బడికి వస్తున్నా చదువు నేర్పకపోవడం చాలా ఆందోళనకరం.

పిల్లలు తమ తరగతికి తగ్గ సామర్థ్యాలు అందుకోలేకపోతే పైతరగతులకు వెళ్లేకొద్దీ చదువు భారం అవుతుంది. తద్వారా మానసికంగా చాలా కుంగిపోవడమే కాకుండా బడి మానేసే పరిస్థితి ఏర్పడుతుంది. అంతేకాకుండా తగిన విద్యాసామర్థ్యాలు అందక బడుల నుండి బయటికొస్తున్న పిల్లలు ఉపాధిలో, ఉన్నత విద్యలో వెలివేయబడి నూతన అసమానతలకు గురి అవుతున్నారు. కాబట్టి ఈ సమస్యను ప్రభుత్వాలు గంభీరమైనదిగా తీసుకోవాలి.

తల్లిదండ్రులు ఈ విషయమై చాలా ఆందోళనకు గురి అవుతున్నారు. పిల్లలు అటుకాకుండా ఇటుకాకుండా పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని అడుగాలో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఏర్పడ్డ విద్యాసామర్థ్యాల

ఉద్యమానికి తల్లిదండ్రుల ఆదరణ పెరుగుతోంది. తల్లులు మరో అడుగు ముందుకేసి మదర్స్ అసోసియేషన్ (తల్లుల సంఘం)గా ఏర్పడి విద్యాశాఖాధికారులను ప్రశ్నించటం మొదలు పెడుతున్నారు.

పిల్లలకు విద్యాసామర్థ్యాలు అందించాలని ప్రభుత్వం, రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లడానికి రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులను, పాఠశాల విద్యాకమిటీలను, ప్రజాసంఘాలను, కార్మిక సంఘాలను చైతన్యపరిచి ప్రతి జిల్లాలో విద్యాసామర్థ్యాల సాధన కమిటీలను ఏర్పాటు చేయాలి. విద్యాసామర్థ్యాలు అందించడంలో విద్యాశాఖ బాధ్యతని విస్తృతంగా ప్రచారం చేయాలి. రాష్ట్ర స్థాయి నుండి జిల్లా, మండల విద్యాశాఖ అధికారులపై నిరంతర ఒత్తిడి తెచ్చి విద్యాసామర్థ్యాలు అందని పిల్లలందరికీ విద్యాహక్కు చట్టం ప్రకారం తరగతివారీ సామర్థ్యాలు అందించాలి.

విద్యాసామర్థ్యాలను ప్రభుత్వం అందించే ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ఒక స్వయంప్రతిపత్తి గల విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేయాలి. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని తరగతులలో చదువులలో వెనుకబాటులో ఉన్న పిల్లలందరికీ ఒక కార్యక్రమం రూపొందించి చదువులో వెనుకబడిన పిల్లలందరికీ విద్యాసామర్థ్యాలను అందిస్తామని హామీ ఇవ్వాలి. ఈ హామీల సాధనకు తెలంగాణ ఎన్నికల్లో ఓటుహక్కును ఉపయోగించుకోవాలి. ❐

# పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి




పంచాయతీ సర్పంచ్‌ల కాలపరిమితి ముగిస్తే ఎన్నికలు నిర్వహించాలిగానీ, ప్రత్యేకాధికారులకు అప్పగించటం సరికాదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణబాబు అన్నారు. ఐదేళ్ల కాలపరిమితి ముగిశాక ముఖ్యమంత్రికి బదులు కొంతకాలం ప్రధాన కార్యదర్శి సీఎంలా వ్యవహరిస్తారు అంటే చంద్రబాబు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. 'ఫెడరలిజం అంటే కేంద్రంపై యుద్ధం చేయటం మాత్రమే కాదు.. అధికారాన్ని స్థానిక ప్రభుత్వాలకు వికేంద్రీకరించటం కూడా' అన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెప్రజల కష్టాలు మరింత పెరిగాయని, చలి, తుఫానుల కాలంలో కూడా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశుద్ధ్యం దారుణంగా తయారైందన్నారు. దేవనకొండ లోక్‌సత్తా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి కనిపించకుండా పెరిగిపోయిందని, లంచాలు, దోపిడీలేని పాలన రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇంఛార్జి రామదాసు గౌడ్, స్టీరింగ్ కమిటీ సభ్యుడు కె.ఆనందాచారి, మండల కార్యదర్శి చంద్రబాబు నాయుడు, పట్టణ అధ్యక్షుడు జానాకుమార్, సురేంద్ర, నల్ల రెడ్డి, దస్తగిరి, రమేష్, రసూల్, గోవర్ధన్, శేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# మ్యాథ్స్‌లో మరీ అధ్వాన్నం

తెలంగాణలోని పదో తరగతి విద్యార్థుల అభ్యసన స్థాయి దారుణంగా ఉంది. దాదాపు అన్ని సబ్జెక్టుల్లో పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నా.. గణితంలో మరీ వెనుకబడి ఉన్నారు. 75 శాతం మార్కులు సాధించినవారు ఒకటీరెండు శాతానికి మించి లేకపోవడం గమనార్హం. సర్వే పరీక్షలో 0–35 మార్కుల్లోపు పొందినవారు 66 శాతానికిపైగా ఉండటం మన చదువుల డొల్లతనాన్ని వెల్లడిస్తోంది. గణితం తర్వాత.. సైన్స్, సాంఘికశాస్త్రం, ఇంగ్లీషు, తెలుగు సబ్జెక్టులలో అభ్యసన సామర్థ్యం తక్కువగా, అత్తెసరు స్థాయిలో ఉంది.

పదోతరగతి చదివే విద్యార్థుల ప్రతిభను ఆయా సబ్జెక్టుల్లో పరీక్షించి భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలను గుర్తించేందుకు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఈ ఏడాది దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించింది. దేశంలోని 610 జిల్లాల్లో 44,514 పాఠశాలల్లో 15.44 లక్షల పదో తరగతి విద్యార్థులను ఐదు సబ్జెక్టుల్లో పరీక్షించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 2,481 పాఠశాలలకు చెందిన 79,423 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదు సబ్జెక్టుల్లో 180 ప్రశ్నలు ఇచ్చి పరీక్షించారు. జిల్లాలవారీగా ఫలితాలను ఎన్‌సీఈఆర్‌టీ విడుదల

**గణితంలో విద్యార్థుల పరిస్థితి (జిల్లాలవారీగా శాతాల్లో)**

| జిల్లా | 0–35 మార్కుల మధ్య | 76–100 మార్కుల మధ్య |
|---|---|---|
| నాగర్‌కర్నూల్ | 73.91 | 0.73 |
| నల్గొండ | 68.60 | 2.13 |
| నిర్మల్ | 75.00 | 0.93 |
| నిజామాబాద | 63.10 | 1.07 |
| పెద్దపల్లి | 61.54 | 2.49 |
| సిరిసిల్ల | 62.45 | 2.53 |
| రంగారెడ్డి | 58.22 | 4.35 |
| సంగారెడ్డి | 57.19 | 4.33 |
| సిద్దిపేట | 54.98 | 2.58 |
| సూర్యాపేట | 64.89 | 2.96 |
| వికారాబాద్ | 83.87 | 0.38 |
| వనపర్తి | 76.48 | 0.61 |
| వరంగల్ గ్రామీణ | 70.35 | 1.08 |

| | | |
|---|---|---|
| వరంగల్ అర్బన్ | 46.47 | 9.22 |
| యాదాద్రి | 73.31 | 1.13 |
| కరీంనగర్ | 50.42 | 6.88 |
| ఖమ్మం | 68.61 | 4.14 |
| కొమురం భీం | 78.84 | 0.37 |
| మహబూబాబాద్ | 70.22 | 2.17 |
| మహబూబ్‌నగర్ | 69.17 | 1.53 |
| మంచిర్యాల | 60.98 | 2.94 |
| మెదక్ | 76.86 | 0.18 |
| మేడ్చల్ | 54.06 | 5.17 |
| కామారెడ్డి | 67.90 | 0.74 |
| జగిత్యాల | 77.53 | 1.01 |
| జనగామ | 64.84 | 1.22 |
| భూపాలపల్లి | 68.50 | 1.25 |
| గద్వాల | 72.54 | 0.19 |
| ఆదిలాబాద్ | 68.33 | 1.85 |
| భద్రాద్రి | 74.76 | 0.94 |
| హైదరాబాద్ | 59.32 | 3.42 |

చేసింది. ఆయా సబ్జెక్టుల్లో 35 శాతం కంటే తక్కువ మార్కులు సాధిస్తే అక్కడ విద్యార్థులు విద్యాపరంగా ప్రమాదంలో ఉన్నట్టేనని సంస్థ అభిప్రాయ పడింది.




### 50 శాతం దాటటమంటే పెద్ద ప్రయాసే

ఒక్కో సబ్జెక్టులో 50 శాతం మార్కులు దాటినవారు తక్కువగా ఉన్నారు. గణితంలో అభ్యసన ఫలితాలు మరీ అధ్వాన్న స్థాయిలో ఉన్నట్టు తేలింది. ఆదిలాబాద్ జిల్లాలో గణితంలో 50 శాతం మార్కులు దాటినవారు కేవలం 10.92 శాతమే. సైన్స్‌లో 75 శాతం దాటినవారు ఒక్కరూ లేరు. జోగులాంబ గద్వాల జిల్లాలో 50 శాతానికిపైగా మార్కులు సాధించినవారు 9.85 శాతం. జగిత్యాల జిల్లాలో అది 8.10 శాతం. ఇక్కడ 77.53 శాతం విద్యార్థుల మార్కులు 35 శాతం లోపే. మెదక్ జిల్లాలో సాంఘిక శాస్త్రంలో 75 మార్కులకుపైగా ఎవరికీ రాలేదు. ఈ జిల్లా అన్ని సబ్జెక్టుల్లో రాష్ట్ర సగటు కంటే వెనుకబడి ఉంది. కుమురం భీం జిల్లా విద్యార్థులదీ అదే పరిస్థితి. ఈ జిల్లాలో సైన్స్‌లో 75 శాతానికిపైగా మార్కులొచ్చినవారు శూన్యం. గణితంలో 50 శాతం మార్కులు దాటినవారు 5.80 శాతం మందే. వికారాబాద్ జిల్లాలో గణితంలో 50 శాతం మార్కులు దాటినవారు 3.80 శాతం లోపే ఉన్నారు. కరీంనగర్, మంచిర్యాల, వరంగల్ అర్బన్, సంగారెడ్డి జిల్లా అన్ని సబ్జెక్టుల్లో రాష్ట్ర సగటు కంటే ఎగువనే ఉన్నారు. నిర్మల్, సిద్దిపేట జిల్లాలు నాలుగు సబ్జెక్టుల్లో రాష్ట్ర సగటు కంటే పైన నిలిచాయి.

* ప్రభుత్వ బడుల కంటే ప్రైవేటు పాఠశాలల్లో అభ్యసన ఫలితాలు కొంత మెరుగ్గా ఉన్నాయి. ఆంగ్లంలో ఆ తేడా భారీగా ఉంది. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు సగటున 30.83 శాతం మార్కులు సాధించగా, ప్రైవేటులో 53.80 శాతం పొందారు. ప్రభుత్వ, ప్రైవేటు బడుల విద్యార్థులు వరుసగా.. కరీంనగర్ జిల్లాలో 34.05 శాతం, 55.72 శాతం, నల్గండ జిల్లాలో 29.98 శాతం, 46.11 శాతం, నిజామాబాద్‌లో 32.88 శాతం, 44.08 శాతం మార్కులను సాధించారు. ❑

# లోక్‌సత్తా మిత్రులారా.. ఎన్నికల్లో పదండి ముందుకు!

- ఎ. అన్నపూర్ణ, కేలిఫోర్నియా




ఆత్మీయ మిత్రులారా!

మనమంతా కలిసి ఆత్మీయ సందేశాలను, భవిష్యత్ ప్రణాళికలను మరింత పెద్దఎత్తున పంచుకునే సమయం మరోసారి వచ్చేసింది. అది రాబోయే ఎన్నికల గురించిన విశేషాలు అని మీకు తెలుసు.

గతానికీ ఇప్పటికీ జరుగుతున్న, మారుతున్న పరిణామాలు చర్చించుకుందాం. మనమెప్పుడూ మంచి మిత్రులమే! దేశ ప్రజలందరికీ ఆత్మీయులం. ప్రజలందరికీ మంచి జరగాలనీ, రాబోయే తరం యువత స్వచ్ఛమైన పాలన, అవినీతిరహిత సమాజంలో మనుగడ సాగించాలనీ కోరుకునే శ్రేయోభిలాషులం. అందుకే మనమంతా కలిశాం. మన భావాలు ఒకరితో మరొకరం పంచుకోగలిగాం. మన కృషి ఏనాటికైనా ఫలించినట్టయితే మన అందరికీ ఆనందదాయకం కూడా! ఒక నిజాయతీగల మచ్చలేని నాయకుడు, ఎంతో లోతుగా దూరదృష్టితో ఈదేశ భవిష్యత్ గురించి ఆలోచించి పరిష్కారాలను అందించిన దార్శనికుడు మనమంతా ఏకం కావడానికి వేదిక కల్పించారు. ఓటుకు విలువిచ్చి నోట్లతో అమ్ముడుపోకుండా నిజాయితీకి, నిజానికి, మంచి ప్రయత్నానికి తోడుగా వస్తారని మీరందరూ నిరూపించారు. మంచికి, నైతికతకు, వాస్తవాలకు నిలబడి లోక్‌సత్తా పార్టీకి అంకురం వేశారు. మొదటి అడుగు 2009లో పడిందీ అంటే మీ అందరి సహకారం వల్లనే. ఇది మన వ్యక్తిగత విజయం కూడా (ఒక మనిషి విలువను, గొప్పతనాన్ని అంచనా వేసేది ఆమె/అతను వల్ల సమాజానికి జరిగిన మేలును బట్టేగా!).

ఎత్తులు, జిత్తులు మనకు నచ్చవు. రాజకీయ పార్టీలకు అవే అవసరం అని మనం భావించలేదు. ఒక్క ఎన్నికతో చరిత్ర మారిపోదు. కేవలం ఒక్క నాయకుడి కారణంగా ఒలింపిక్స్‌లోలా ప్రభంజనం సృష్టించలేం. ఒకరు నలుగురై నలుగురు పదిమందిగా దినదినాభివృద్ధి చెందుతూ ప్రతి వ్యక్తికీ, ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికీ, ప్రతి వార్డుకీ, ప్రతి పట్టణానికీ, నగరానికీ చేరువగా పోవాలి. అందుకు అశేష ప్రజానీకం ఏకం కావాలి. ఒక సైన్యంగా ఏర్పడి విజయ సోపానాలు వేసుకోవాలి. దార్శనిక నేత విత్తును నాటారు. అది మొలకెత్తింది. లేత వయసు మొక్కగా కొమ్మలు రెమ్మలతో ఎదుగుతోంది. దీనికి బలమైన ఎరువు కావాలి, చీడపీడలు రాకుండా, పశువులు తినేయకుండా రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయాలి. మనం శక్తిమేరకు ఎరువు వేశాం. ఈ మొక్క మహా వృక్షంగా ఎదగడానికి ఎందరో సహాయం చేయాలి. దానికి తగిన సమయమూ రావాలి. సదాశయంతో జయప్రకాష్ నారాయణ్‌గారు లోక్‌సత్తా ఉద్యమాన్ని, ఆ తర్వాత పార్టీని స్థాపించారు. 2014 ఎన్నికలలో అనుకున్నది సాధించ లేకపోయినా పార్టీని కనుమరుగు చేయలేదు. అది యధాతథంగానే ఉంది. మన అందరి ఆశలనూ వమ్ముచేయకూడదని, మన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉండాలని ఉద్యమసంస్థ ఆధ్వర్యంలో వారు బలంగానే కృషి చేస్తున్నారని మీ అందరికీ తెలుసు. గత 4 సంవత్సరాలుగా కూడా ఆయన రాజకీయ సంస్కరణ కృషిని ఉధృతంగానే కొనసాగిస్తున్నారు.. కాకపోతే నిశ్శబ్దంగా, ఎన్నికల రణగొణ ధ్వనులు లేకుండా!

రాజకీయ పార్టీ ఉద్యమ సంస్థ నుంచి వచ్చిన మరో వేరు. అందుకే రెండింటికీ తేడా లేదు. అవి విడిపోవు, ఆలోచనలు మారిపోవు. వేదిక మారవచ్చు, పద్ధతులు మారవచ్చు అంతే! కాబట్టి మనం ఎప్పటిలా లక్ష్యాన్ని చేరుకోవడానికి అంకితభావంతో పనిచేద్దాం. కుటుంబ పరిస్థితుల కారణంగా నేను అమెరికాలో ఉండిపోయాను. మిమ్మల్ని వ్యక్తిగతంగా కలుసుకోలేకపోతున్నాను. కానీ మనం ఎప్పుడూ చర్చించుకుంటూనే ఉన్నాం. పరిస్థితుల పట్ల అవగాహనతోనే ఉన్నాం. మీకు లోక్‌సత్తా ఎంత చేరువో నేను కూడా అంత చేరువలోనే ఉంటాను. మోడ్రన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక దూరభారాలు లేవు. ప్రజాదరణే మనకి బలం. రాష్ట్రాలు విడిపోవచ్చు, దేశం-పరదేశం

అనేవి కేవలం మాటలకే తప్ప మనం ఎన్నటికీ దూరం కాము.

ముఖ్యంగా ఇప్పుడు పంచుకోవాల్సిన విషయాలు ఏమంటే, కొన్ని గతంలో జరిగిన అనుభవాలు కావచ్చు, ప్రజల అభిప్రాయం కావచ్చు, మరో విషయం కావచ్చు. గత నాలుగు సంవత్సరాలుగా పరిశీలన చేస్తున్నాం. కానీ మన లక్ష్యానికి దూరంగా జరిగే ప్రయత్నం మాత్రం ఏనాడూ జరగలేదు. అందుకే పార్టీ ఏదైనా, వ్యక్తుల, నాయకుల స్వచ్ఛతను మనం కోరుకుంటున్నాం. నా మనసులో చాలాకాలంగా ఉన్న ఒకమాట మీతో పంచుకోవాలనిపిస్తోంది. అది రేపోమాపో నిజం అవుతుందని నమ్మకంగా అనిపిస్తోంది. అది మన జేపీ, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణగారు కలిసి ప్రజల కోసం ఒక మహత్తర కార్యాచరణను ప్రకటిస్తారన్న ఆలోచన. ఇది నా మనసులోనే కాదు, చాలామంది మనసుల్లోని మాట, నిరీక్షణ కూడా! లక్ష్మీనారాయణగారు, ఇంకా అలాంటివారు జేపీతో కలిసి జనాన్ని కదిలించటం, ఎన్నికల్లో తిరిగి పోటీ చేయటం త్వరలోనే జరగొచ్చు లేదా 2024 ఎన్నికల నాటికి కావచ్చు. ఇప్పుడు కలిసి పనిచేస్తూనే వచ్చే ఎన్నికల నాటికి పోటీ చేయవచ్చు. ''నేను పార్టీ రాజకీయాల్లో స్థిరపడవచ్చు లేదా నా స్థానంలో యువత ఆ బాధ్యత తీసుకోవచ్చు. కానీ అందరికీ ఎదిగే అవకాశాలు వచ్చేదాకా, నివారించదగ్గ బాధలను తొలగించేదాకా పార్టీపరంగా, పార్టీలకతీతంగా ప్రజాస్వామ్య సంస్కరణల పోరాటం జరగాల్సిందే" అని జేపీ ఇచ్చిన సందేశాన్ని మనం మరచిపోము.

ఒక లక్ష్యం సాధించడానికి కావలసిన సరైన నాయకుడు మనకి ఉన్నారు. మనం సదా ఆయనను అనుసరించడమే కర్తవ్యంగా భావించాము. ఎందుకంటే, ప్రశ్నించాల్సిన అవసరం ఎప్పుడూ కలిగించని నేత ఆయన. సమస్యలు ఒక్కరికికావు, అందరివీను! అందుకే మరింత పట్టుదలతో ముందుకు అడుగులు వేయాలి. నిజాయితీపరులు మౌనంగా ఉంటే అరాచకాలు మరింత విజృంభిస్తాయి. నాలుగేళ్ల క్రితం మీకున్న బాధ్యతలు చాలావరకూ తీరిపోయి ఉంటాయి. కొంత తీరిక చేసుకోగలిగే అవకాశం ఉండి ఉంటుంది. కాబట్టి రెట్టించిన ఉత్సాహంతో ముందుకు రండి. నాకు తెలుసు, మీరు అనుకుంటే సాధించలేనిది లేదు. ఇంటిని, బిడ్డలను తీర్చిదిద్దగలిగిన మీరు రాజకీయాలను కూడా ప్రక్షాళన చేయగలరు. గతంలో ఎదుర్కొన్న ఆటుపోట్లను ఇప్పుడు తేలికగా అధిగమించగలరు. ఎందరో మంచి వ్యక్తులు, మంచి వ్యాప్తి చేయాలను కుంటున్నవారు- పేదలు, మహిళలు, యువత ముందుకు వస్తున్న ఈ తరుణంలో గతంకంటే మనం బలంగా ఉన్నాం. గతంలో జరిగిన ఓటమి గెలుపు పట్టుదలకి మరింత దృఢత్వాన్నిచ్చింది. 2018-19 ఎన్నికల్లో మన పోటీ చేయకపోవచ్చు... కానీ పౌరులుగా ఎంతవరకూ పనిచేయగలమో అంతవరకూ చేద్దాం. మసి పూసి మారేడుకాయ చేస్తూ పార్టీలు చేసే హంగామాను తిప్పికొడదాం. సరైన ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఓటును అటువంటి అభ్యర్థులు, పార్టీలవైపునకు మళ్లించే ప్రయత్నం చేద్దాం. ఎన్నికలయ్యాక వారి చేత ఎజెండాను అమలు చేసేలా బెత్తం పట్టుకుని వెంటాడదాం.

నిరుద్యోగ యువతను శాశ్వత నిరుద్యోగులుగా కొనసాగించే ప్రయత్నాన్ని అడ్డుకుందాం. నిరుద్యోగ భృతిని అందుకునే దౌర్భాగ్యస్థితి తెలుగువారికి అవసరమా? తాత్కాలిక ఉపశమనం మంచిదా.. శాశ్వత భరోసా మంచిదా? అని యువతను ఆలోచింప చేద్దాం. వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సాయాల్ని తమకిస్తామంటే యువతలో పౌరుషం రావాలి. బిచ్చం లాంటి భృతులు, దయాదాక్షిణ్యాలు మనకి అవసరం లేదు. బతుకమ్మ చీరలు సరిగ్గా ఉపయోగిస్తే రెండు రోజులు మన్నవు. లేటెస్ట్ ఫ్యాషన్ చీరలు, డ్రస్సులు కొనగల స్థితిలో ఉన్న ఆడపడుచులు ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడరు. బతుకమ్మ చీరలు ఎలా తూకానికి వేసి అమ్ముకుంటున్నారో చూశాక కూడా ఇంకా పాలకులు నటిస్తుండటం, మీడియాలో బాకాలు ఊదుకోవటం అసహ్యం కలిగిస్తుంది. నేతకారులకు సహాయాన్ని ఆ డబ్బుతో ఇవ్వండి, కానీ మహిళలకు ఇవ్వాల్సింది ఆ చీరలను కాదు (చీరే ఎందుకు కట్టుకోవాలన్నది కూడా చర్చనీయాంశమే). నిరుపేద వారంటే.. అవయవాలు సరిగా పనిచేస్తున్నవారు, పని చేయగలిగినవారు కాదు. కడుపు నిండా తిండిని తినేందుకు చేతి నిండా పనికల్పించాలనే వారు వాస్తవంగా కోరుకుంటున్నారు. గతిలేక లంచం ఇచ్చిన పేదవారికి కనిష్టంగా 3 ఏళ్లు, గరిష్టంగా 7 ఏళ్లు జైలుశిక్ష విధించాలి అని పార్టీలన్నీ కలిసి కుమ్మక్కయి అవినీతి నిరోధక చట్టానికి సవరణ తెచ్చాయిగదా.. ఆ సవరణను నిజంగా ప్రయోగించాల్సింది ఓటు కోసం ప్రజల్ని ప్రలోభపెడుతున్న నాయకులు, పార్టీల మీదే!

అలాంటి పనికిమాలిన ఉచితాలను ఇచ్చే బదులు.. ఆరోగ్యాన్నిచ్చే వైద్య సేవల్ని, మందుల్ని ఉచితంగా ఇవ్వండి. ప్రజల్ని నిర్వీర్యం చేసే ఉచితాల్ని కాకుండా.. ప్రజల్ని బలమైనవారిగా, ఆత్మవిశ్వాసం కలవారిగా తీర్చిదిద్దే

ఉచితాల్ని ఇవ్వాలని లోక్‌సత్తా తరపున డిమాండ్ చేద్దాం, ప్రజల్ని సమీకరిద్దాం. ప్రాథమిక స్థాయి నుంచి నాణ్యమైన ఆరోగ్యాన్ని ఉచితంగా ఇస్తే, యువత శారీరకంగా ఇంకా బలంగా తయారవుతారు, చుట్టూ బోలెడన్ని ఉద్యోగావకాశాలూ వస్తాయి, వారి తల్లిదండ్రులూ ఆరోగ్యంగా ఉంటూ వారికి అండగా ఉండగలుగుతారు.

పైగా ఉచితాలేవీ కేసీఆర్, చంద్రబాబు, మోదీ పార్టీవాళ్లు తమ జేబులోని డబ్బుతో ఏమీ ఇవ్వటం లేదు. ప్రజలుగా మనం కట్టిన పన్నుల డబ్బునే ఇలా వందేరం చేస్తున్నారు. ఉపయోగంలేని ఆకర్షణలకు డబ్బులు విరజిమ్మి, అవసరమైన వాటికి మొండి చెయ్యి చూపటం ద్వారా వాళ్లు మన డబ్బును దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారు. పేనుకు పెత్తనమిచ్చిన తరహాలో వ్యవహరి స్తున్నారు. మాకు అలాంటి ఉచితాలొద్దు, స్వయంకృషితో ఎదిగే అవకాశాల కోసం మంచి చదువు, ఆరోగ్యం వంటివి కావాలి.. అని యువత ఎన్నికల్లో డిమాండ్ చేయాలి. ఇలా చైతన్యపరిచే బాధ్యతను లోక్‌సత్తా వలంటీర్లు తీసుకోవాలి.

గతంలో జరిగిన ఎన్నికలు – ఇప్పుడు జరగబోతున్న ఎన్నికలను బేరీజు వేసుకోండి. లాభనష్టాలు – జరగని పనులను లెక్కతీయండి. గతంలో జరిగిన మంచి ఎక్కడ ఎందుకు ఆగిపోయిందో గుర్తించండి, జరగాల్సిన మంచి ఎందుకు జరగటం లేదో పసిగట్టండి. వాటిని ఎన్నికల ఎజెండాగా మారిస్తే పార్టీలకు ఇక ఒప్పుకోవటం తప్ప మార్గం ఉండదు. ఓట్ల కోసం దేనికైనా వాళ్లు సిద్ధమే.

ఎన్నికల ఎజెండాను మార్చగలిగితే చాలు.. ఎన్నికల్లో మనం పోటీ చేయకుండానే పెద్ద విజయం సాధించేసి నట్టు. ఈ అయిదేళ్లలో యువత, మహిళలు జనాభాపరంగా పెరిగారు కనుక లోక్‌సత్తావారు మరింత బలాన్ని పుంజుకోవచ్చు. యువతను అందుకో గలిగే శక్తి లోక్‌సత్తా భాష, లోక్‌సత్తా ఎజెండాకు మాత్రమే ఉంది. ఎందుకంటే, ప్రస్తుతం ప్రధాన పార్టీలుగా ఉన్నవన్నీ గతించిపోతున్న పార్టీలు, లోక్‌సత్తా మాత్రమే భవిష్యత్ పార్టీ. ఈరోజు నుంచే లక్ష్యానికి చేరువకాగల అవకాశాన్ని అందిపుచ్చుకోండి. లోక్‌సత్తా కమిటీ సభ్యులు మీకు సహాయసహకారాలు అందిస్తారు.

ఎన్నికల వరకూ ఒక పార్టీ వైపు మొగ్గి తర్వాత అధికార పార్టీలోకి మారిపోయే స్వార్థశక్తుల మీద నిఘా పెట్టండి. గెలుపు ఓటములు మాత్రమే లెక్కలోకి రావు. ఆచరణలో కనిపించే ప్రగతినే చూడాలి. మచ్చలేని నాయకులకు ప్రోత్సాహాన్నిస్తూ, డబ్బును పంచేవారి మీద నిఘా పెట్టాలి. బలహీనతలకు లోనుకావచ్చు. నేరచరితులకు టికెట్టివ్వద్దని ఎంతగా చెప్పినా, పార్టీలు పక్కదారుల్ని వెతుకు తున్నాయి. 'ఒకరిని వేలెత్తి చూపిస్తే మరొకరు మనలోని లోపాలను నిలేస్తా రన్న' భయం కావచ్చు.. దీనిపై పలువురు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అనుభవంతో మేధావులు, సీనియర్ సిటిజన్లు జరుగుతున్న కుట్రలను ఛేదించాలి. యువతకు అండగా నిలవాలి. 'మనకెందుకు – ఏ పార్టీ వచ్చినా ఒకటే' అనే నిరాశ నుంచి నవమాజాన్ని బయటపడేయాలి. మన జేపీ ఎప్పుడూ చెబుతుంటారు – 'పార్టీలు మారుతున్నారు తప్పితే కొత్తగా (నేతల వంశీయులు, వ్యాపార భాగస్వాములు మినహాయించి) ఎవరూ రాజకీయాల్లోకి రావడం లేదు' అని. పైన ఎన్నికల్లో అంత పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేస్తూ, దిగువన స్థానిక ప్రభుత్వాలు లేకుండా చేస్తే ఇక సామాన్యులు రాజకీయాల్లోకి ఎలా రాగలుగుతారు? సామాన్యులు రానప్పుడు పెద్ద ఎత్తున నాయకులు ఎలా తయారవుతారు?.. అందుకే రాజకీయా ల్లోకి కొత్తవారు రావడం లేదు అనే కంటే.. రానీయటం లేదు అనుకోవచ్చు. అలాంటి వ్యవస్థను మనం ఛేదించాలి. బెర్లిన్ గోడల్లా రాజకీయ నేతలు తమ చుట్టూ కట్టుకున్న వ్యక్తిగత స్వార్థ, పెత్తందారీ రక్షణల్ని బద్దలు కొట్టాలి.

ఇప్పుడు ఐటీ దాడులు జరుగుతుంటే గొంతు చించుకుని అరుస్తున్నారు. వేమంతా కడిగిన ముత్యాలం– అంటున్నారు. ఇదంతా ఎవరిదో కుట్ర అని గగ్గోలు పెడుతున్నారు. డబ్బు నిలవలను బైటికి తీయకపోతే రాబోయే ఎన్నికలకు ఓట్లు కొనడంలో 'రేటు' పెరిగిపోతుంది. అయితే ఈ దాడులు అధికార క్రీడలో భాగంగా జరగటమే తప్ప.. ప్రజల ప్రయోజనాల కోణంలో కాకపోవటమే దురదృష్టకరం.

ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటూ విలువైనదే. 'నోటా' ఏర్పాటును లోక్‌సత్తా సమర్థించడానికి కారణం కూడా.. రాజకీయ నేతల మీద ద్వేషంతో ఎన్నికల్లో ఓటు వేయకుండా తప్పించుకునే అవకాశం ఎవరికీ ఉండకూడదని! అయితే ఓటర్ల లిస్టుల్లో అవకతవకలు దాదాపు 14 ఏళ్ల క్రితంలోలాగానే తెలంగాణలో ఉన్నాయన్న అధ్యయనాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్)/ లోక్‌సత్తా కూకట్‌పల్లిలో చేసిన శాంపిల్ అధ్యయనంలో ఈ విషయం స్పష్టంగా బైటపడింది. పోస్టాఫీసు వంటి వాటిని నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేసి ఓటరు నమోదును శాశ్వత కార్యక్రమంగా చేయాలని లోక్‌సత్తా అనేకమార్లు కోరినా ఎన్నికల సంఘం సోమరిపోతులా వ్యవహరిస్తూ మీడియాలో ఆర్భాటాలకు పరిమితమవటం బాధాకరం. ఈసీ పనితీరు ఇలా ఉంటే, ఎలక్ట్రానిక్ ఓటింగ్

యంత్రాల ద్వారా దొంగ ఓట్లు వేస్తున్నారని కొన్ని పార్టీలు సాక్ష్యాధారాలు లేని ఆరోపణలు చేస్తున్నాయి. ఎన్నికలు దగ్గరికొచ్చే కొద్దీ అబద్ధపు ప్రచారాలు రకరకాల రూపాల్లో పేట్రేగిపోతాయి. వీటన్నిటినీ అధిగమించి కేవలం ఎజెండా చుట్టూ ప్రజలంతా తమ ఓటుహక్కును వినియోగించుకునే కృషి చేయాలి.

ఎవరో వస్తారు, ఏదో చేస్తారు అని ఎదురుచూడటం తప్పు కాదు అని నేను నమ్ముతాను. అయితే ఆ వచ్చేవారితో మనం కూడా కలిసి నడవాలి. అప్పుడే మార్పు సాధ్యమవుతుంది. కేవలం ఒక రంగంలో నిష్ణాతులైనంత మాత్రాన వారు రాజకీయాల్లో రాణిస్తారనే నమ్మకం లేదు. ఇతర రంగాల గురించి కూడా వాళ్లు సమాచారాన్ని తెలుసుకుంటుండాలి. ఈ పని చేయకపోవటం వల్లే సినిమా నటులు రాజకీయాల్లోకి వచ్చి నటించే లేదా డైలాగులు, ఉపన్యాసాలు చెప్పే పరిస్థితి కనిపిస్తోంది. టోటల్లీ డిఫరెంట్ స్టేజ్ పొలిటికల్ పార్టీ అంటే! అలా అని ఏదో ఆశయం ఉన్నవారిని రావొద్దనికానీ, మీరు అనర్హులు అని కానీ చెప్పలేం. ఆ స్వేచ్ఛ ప్రతివారికీ ఉంటుంది. రాజకీయ పార్టీలోకొచ్చి సామర్థ్యంతో పనిచేసే శక్తిలేని నటులు, క్రీడాకారులు, ఇతర సెలబ్రిటీలు ఉదారంతో నిధుల నమీకరణకు తోడ్పాటునందించే బాధ్యతను నిర్వహించవచ్చు. ఇది వారికి కొంత తేలిక. తమను ఒకస్థాయికి తెచ్చిన ప్రజలకు సాయం చేయటం తమ బాధ్యతగా సెలబ్రిటీలు గుర్తించాలి. ఇలాంటి అవకాశాల్ని కూడా ఉపయోగించి లోక్‌సత్తా తన ఎజెండాను ప్రజల్లోకి, ముఖ్యంగా ఓటర్లలోకి తీసుకెళ్లాలి.

ఒకప్పుడు మన ఇళ్లల్లో తండ్రిగారు ఎవరికి ఓటు వేయాలో చెప్పేవారు. ఇప్పటితరంవారికి ఆ అవసరం లేదు. తండ్రి కంటే ఎక్కువగా ప్రజల్లో మనలుతున్నారు, నమాచారాన్ని చూస్తున్నారు. వారికి నచ్చిన మార్గాన్ని వారు ఎంచుకోగలరు. మీకు గుర్తుందా.. మనకి మొదటిసారి ఓటు హక్కు వచ్చినప్పుడు పెద్దలు చెప్పినట్టే, వారు సూచించిన వారికే వేశాం. ఆ తర్వాత జేపీగారు వార్తాపత్రిక మాధ్యమంలో 'భవిష్యత్ భారతం' అంటూ ఎంతో విలువైన, వినూత్నంగా ఆసక్తికరమైన అంశాలను, పరిష్కారాలు సహా వ్యాసాల రూపంలో ప్రజలకు అందించారు. మన పెద్దలే వాటిని మన చేత చదివించి.. ఓటు వేసే నిర్ణయాన్ని మనలనే తీసుకోమన్నారు. అంటే ఎంత మార్పు! పెద్దలెందరికో అవగాహన కుదిరింది. శాసించే నైజం నుంచి మన నిర్ణయాలను మనకే విడిచిపెట్టేంత నమ్మకాన్ని జేపీ భావజాల అక్షరాలు ఇచ్చాయి. ఆనాటి మార్గదర్శకాలు మన తర్వాతి తరం వారికి కూడా ఆచరణలో పెట్టగలంత భరోసా నిస్తున్నాయి. ఇంకొన్ని తరాలకూ ఇస్తాయని సురాజ్య యాత్ర ద్వారా తేటతెల్లమవుతోంది. అదీ వ్యక్తిత్వం, మేధస్సు, దార్శనికత గల నాయకత్వం అంటే! ఒక ప్రజామేధావి అహర్నిశలూ యువత భవిత కోసం, రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం తపించి పోరాడారు. విశ్వాసాన్ని కాకుండా.. అవగాహనను మార్గంగా చేసుకుని ప్రజలకు ఎన్నో విషయాలు విడమర్చి చెప్పారు. రాజకీయాలంటే అసహ్యించుకోవడం తప్పు, వాటిని మార్చడానికి మంచి రాజకీయాలే మార్గమని, అందుకోసం పూనుకోవాలని బోధించారు, నినదించారు. జేపీ ఏనాడూ 'నేనో ఉద్యమ సంస్థను ప్రారంభించాను, మీరంతా వచ్చి చేరండి, నాకు సహకరించండి' అని అడగలేదు (ఓట్లు వేయండి అని ప్రజల్ని అడగండి సార్ అంటే.. భోజనం పెట్టమని తన తల్లిగారిని కూడా అడగలేదని జేపీ ఓ ఎన్నికల ప్రచారంలో జవాబిచ్చారు). వారి ఆశలను, ఆశయాలను, జరుగుతున్న పరిణామాలలో రావాల్సిన మార్పును పత్రికల ద్వారా, సమావేశాల ద్వారా, కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తూ దిశానిర్దేశం చేశారు. ఆ భావాలకు స్పందించి వచ్చినవారు పనిచేసుకోవటానికి వేదికల్ని నిర్మించి ఇచ్చారు. ఆయన భావాల్ని చదివి మనంతమనంగా వెళ్లి చేరాం! 22 సంవత్సరాల క్రితం మనమంతా ఎలా ఆలోచించి జేపీ ఏర్పాటు చేసిన వేదిక మీదికి చేరామో, అంతేస్థాయి సంకల్పం ఈరోజుకీ మనలో ఉంది. అంత సంకల్పాన్నిచ్చే భావజాలం లోక్‌సత్తాది. అది మన జీవితకాలం మర్చిపోలేం, తర్వాతితరాలకు అందించకుండా ఉండలేం.

ఇప్పుడు ఎన్నికల సమయం మన ఆకాంక్షల్ని, ఆశయాల్ని, బాధ్యతల్ని నెరవేర్చే అవకాశం. మన శక్తిమేరకు పనిచేద్దాం. సరైన ఎజెండాను ప్రజలకు వివరిస్తూ.. వారి ఓటుకు-వారు కడుతున్న పన్నుల డబ్బుకు- వారి జీవితాల్లో నిజమైన అభివృద్ధికి గల సంబంధాన్ని తెలియజేద్దాం. ఆ ఎజెండా చుట్టూ ఎన్నికలు జరిగేలా శాయశక్తులా ప్రయత్నిద్దాం. నాకు తెలుసు.. మీరు ముందుకు వస్తారు. రాబోయే తరానికి మంచిబాటను వేస్తారు. రాజకీయాలను ప్రక్షాళన చేయటంలో మీ వంతు పాత్రను పోషిస్తారు. జనహితాన్ని కోరే క్రమంలో మీ జీవితాల్నీ ధన్యం చేసుకుంటారు. నాయకత్వ బాధ్యతలను నిర్వహించేందుకు సిద్ధమైన మనం ఇక నుంచి వేల సంఖ్యలోకి విస్తరించాలి. మీ మీద ఆ నమ్మకం నాకుంది. మిత్రులారా.. పదండి ముందుకు! ❑



# 'స్మార్ట్ కరీంనగర్' కోసం.. సిటీ పౌరులం ముందుకొద్దాం

- ఎం. ధర్మారావు
రాష్ట్ర రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ (ఇరిగేషన్)
mdhramarao.water@gmail.com

**1) కరీంనగర్ 'స్మార్ట్ సిటీ' ప్రతిపాదన**

కరీంనగర్ నగరాన్ని "స్మార్ట్ సిటీ"గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. నగరంలోని పౌరులకు నాణ్యమైన జీవితాన్ని, స్వచ్ఛమైన, సుస్థిర పర్యావరణాన్ని అందించేందుకు కావలసిన మౌలిక వసతుల్ని పెంపొందించటం.. ప్రగతి, అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగే మేలిమి వలయానికి నాంది పలకటం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

"స్మార్ట్ సిటీ" మిషన్ ప్రకటన, మార్గదర్శకాల్లో ప్రభుత్వం ఇలా పేర్కొంది:

1. ఈ ప్రాజెక్టు పౌరుల చొరవతోనే మొదలవుతుంది, పౌరుల సంప్రదింపులతోనే లక్ష్యాల సాధన ఉంటుంది. ఇందులో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్లు, సీనియర్ సిటిజన్లు, బస్తీ నివాసితుల సంఘాలు వంటి ప్రజాబృందాల సృజనాత్మక భాగస్వామ్యం కూడా ఉంటుంది. సంప్రదింపుల్లో భాగంగా పౌరులు, పౌర బృందాలు లేవనెత్తే అంశాల్ని, సమస్యల్ని, వారు అనుకునే ప్రాథమ్యాల్ని గుర్తిస్తారు. పౌరుల ద్వారానే పరిష్కారాలు వచ్చేట్టు చూస్తారు. పాలనలో పౌరుల భాగస్వామ్యం మొక్కుబడి కాదు. అభివృద్ధి సుస్థిరమవ్వాలంటే, ఉమ్మడి కార్యక్రమాల అమలులో పౌరుల భాగస్వామ్యం, పర్యవేక్షణ ఉండాలి.


2. సంస్కరణల అమలులో స్మార్ట్ పరిష్కారాల్ని ఆచరణలో పెట్టటం. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాల్ని సాధించేలా పనుల్ని రూపొందించి, నాణ్యతా ప్రమాణాలను జోడించి మెరుగైన ఫలితాలను సాధించటం.

3. దీన్ని బట్టి ప్రాజెక్టు అమలులో, అభివృద్ధిలో.. ప్రభుత్వ ఏజన్సీలు, అక్కడి సంబంధిత పౌరులు, బృందాలు మూలస్తంభాలని అర్థమవుతుంది.

కాబట్టి, స్మార్ట్ సిటీ నిర్మాణం అంటే ఏమిటో, లక్ష్యం ఏమిటో ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలూ స్పష్టంగా అర్థం చేసుకోవటం అవసరం.

**2) "స్మార్ట్ సిటీ" అంటే ఏమిటి**

1. స్మార్ట్ సిటీ అంటే.. పరిశుభ్రంగా, పొందికగా, అందంగా ఉండే టౌన్‌షిప్. దీనికి




అవసరమైన అన్ని మౌలిక వసతులూ ఉంటాయి. రోజువారీ సమస్యలను ఎదుర్కోవటానికి పౌరులు చిన్న చిన్న పరిష్కారాలను తెలివిగా, పెద్ద భారం లేకుండానే అమలు చేస్తుంటారు. ఇలాంటి నేపథ్యం ఉన్నప్పుడే, సానుకూల అభివృద్ధి జరుగుతుంది. పరిశుభ్రమైన, సుస్థిరమైన పర్యావరణం, ప్రతి ఒక్కరికీ చెప్పుకోదగ్గ నాణ్యమైన జీవితం సాధ్యమవుతాయి.

2. పౌరుల ఆకాంక్షల్ని, అవసరాల్ని తీర్చేందుకుగాను, మొత్తం పట్టణ జీవావరణాన్ని (ఎకోసిస్టం) ఆదర్శప్రాయంగా అభివృద్ధి చేయటం ప్రధానంగా స్మార్ట్‌సిటీ లక్ష్యం.

ఈ పట్టణ ఎకోసిస్టంకు నాలుగు సమగ్రాభివృద్ధి మూల స్తంభాలుంటాయి.

- ⋆ వ్యవస్థల నిర్మాణానికి సంబంధించినది
- ⋆ భౌతికపరమైనది
- ⋆ సామాజిక
- ⋆ ఆర్థిక మౌలిక వసతులకు సంబంధించినది

**3) స్మార్ట్ సిటీకి కావలసిన కీలక మౌలిక వసతులు**

- ⋆ తగినంత నీటి సరఫరా
- ⋆ విద్యుత్ సరఫరాకు భరోసా
- ⋆ చెత్త నిర్వహణ సహా పారిశుద్ధ్యం
- ⋆ ప్రజలు తక్కువ సమయంలో గమ్యాలకు చేరటానికి వీలుగా ప్రజారవాణా
- ⋆ అందుబాటులో ఇళ్లు.. ముఖ్యంగా పేదలకు
- ⋆ ఆధునిక ఐటి కనెక్టివిటీ, డిజిటలైజేషన్
- ⋆ సుపరిపాలన, పౌరుల భాగస్వామ్యం
- ⋆ పర్యావరణ పటిష్టత
- ⋆ పౌరుల, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రత, రక్షణ
- ⋆ విద్య, ఆరోగ్యం

**4) 'స్మార్ట్ సిటీ'గా అభివృద్ధి పరచటానికి వ్యూహం**

స్మార్ట్ సిటీల మిషన్‌లో ఏరియా ఆధారిత అభివృద్ధి

వ్యూహంలో.. నగరానికి అదనపు హంగులు సమకూర్చి మెరుగుపరచటం (రిట్రోఫిట్టింగ్), పునరుత్తేజం (రీడెవలప్‌మెంట్) కలిగించటం, నగర విస్తరణ (గ్రీన్‌ఫీల్డ్ డెవలప్‌మెంట్) ముఖ్యాంశాలుగా ఉంటాయి. దీంతోపాటు.. సిటీలోని పలు ప్రాంతాలకు స్మార్ట్ సొల్యూషన్లు వర్తింప చేయటం (పాన్-సిటీ ఇనీషియేటివ్) ఉంటుంది.

ఏరియా ఆధారిత స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్‌కి నాలుగు నమూనాల గురించి ఇంకొంచెం వివరంగా..

* అదనపు వసతులు (రిట్రోఫిట్టింగ్): అంటే, ఆ ప్రాంతంలో ఉన్న మౌలిక వసతుల్లోనే కొత్త ఆలోచనలతో ప్రణాళికల్ని ప్రవేశపెట్టటం, తద్వారా బస్తీలు సహా ఆయా ప్రదేశాల్ని మరింత సమర్థవంతంగా, ఆకర్షణీయంగా మార్చటం. ఆ రకంగా తొలిదశలో, అంటే మౌలిక వసతులను ఏర్పాటు చేసినప్పుడు కల్పించని వసతుల్ని ఇప్పుడు అందించటం.
* పునర్ అభివృద్ధి నిర్మాణం (రీడెవలప్‌మెంట్): ఉన్న ప్రాంతాల్ని, లే అవుట్లని మరింత ఎక్కువ మౌలిక వసతులతో పునర్నిర్మాణం చేయటం.
* గ్రీన్‌ఫీల్డ్ విధానం: ఖాళీగా ఉన్న స్థలాలకు స్మార్ట్ పరిష్కారాల్ని జోడించటం ద్వారా మెరుగైన గ్రామీణ, పట్టణ ప్రణాళికల్ని అమలు చేయటమే గ్రీన్‌ఫీల్డ్ విధానం. పాత పద్ధతులు, నిబంధనలు దీనికి వర్తించవు.
* పాన్-సిటీ అభివృద్ధి: ఈ లక్ష్యంలో భాగంగా.. నగర వ్యాప్తంగా ఇప్పటికే ఉన్న మౌలిక వసతులకు స్మార్ట్ పరిష్కారాల్ని జోడిస్తూ.. ఒక చోట నుంచి ఇంకోచోటికి రవాణా సమయాన్ని తగ్గించటం, నీటి సరఫరా నిర్వహణను మెరుగుపరచటం వంటివి చేస్తారు.

**5) సవాళ్లు:**

* స్మార్ట్ సిటీని సృష్టించటంలో అనేక సవాళ్లున్నాయి, ఇది అనేక ఆచరణసాధ్యమైన నైపుణ్యాల్ని, బలాల్ని సమకూర్చుకుంటూ చేయాల్సిన కార్యం.. అన్నదే అంతిమంగా మిషన్ ప్రకటన, దార్శనికత.
* అదనపు హంగులు, పునర్ అభివృద్ధి నిర్మాణం తదితర కాన్సెప్టుల్ని అభివృద్ధికి సంబంధించిన వివిధ కోణాల్లో విధానకర్తలైన పాలకులు, అధికారులు, భాగస్వాములైన పౌరులు అర్థం చేసుకోవటం, అమలు చేయటం ఇందులో కీలకం.
* ఈ మొత్తం నేపథ్యంలో.. స్మార్ట్ సిటీస్ మిషన్‌లో స్మార్ట్ ప్రజలు పాలనలో, సంస్కరణల్లో చురుగ్గా పాల్గనటం అవసరం. పాలనలో పౌరుల పాత్ర ఒట్టి మొక్కుబడిగా ఉంటే ఉపయోగం లేదు. స్మార్ట్ పౌరులంటే.. తమంతట తాము స్మార్ట్ పరిష్కారాలకనిర్ణయాల్లో, పరిష్కారాల్లో భాగస్వాములయ్యేవాళ్లు! సంస్కరణల అమలు, పరిమిత వనరులతోనే అపరిమిత ఫలితాల్ని సాధిస్తుండటం, ప్రాజెక్టు రూపకల్పనల్ని, అందులో ఉపయోగించే రకరకాల సాంకేతికతల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటం స్మార్ట్ సిటీస్ మిషన్‌లో చేయాల్సిన పనులు.

**6) దార్శనికత, లక్ష్యం**

పైన చెప్పుకొన్న అంశాల ప్రాతిపదికన స్మార్ట్ పరిష్కారాలను అమలు చేయటం ద్వారా నగరాలు టెక్నాలజీని, నైపుణ్యాల్ని.. మౌలిక వసతులు, సేవల్ని మెరుగుపరిచేలా ఉపయోగించుకోగలుగుతాయి. ఈ సమగ్రాభివృద్ధి జీవన నాణ్యతను పెంచుతుంది, ఉపాధి అవకాశాల్ని సృష్టిస్తుంది, అందరి ఆదాయాల్నీ, ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజానీకం ఆదాయాల్ని పెంచుతుంది.

స్మార్ట్ సిటీల్లో సమగ్రాభివృద్ధి అంటే ఏం చేయాలి..

* ఏరియా ఆధారిత అభివృద్ధి కార్యక్రమాల్లో- మిశ్రమ (మిక్స్‌డ్) భూ వినియోగాన్ని ప్రోత్సహించాలి. అంటే.. ఖాళీగా, ఎటువంటి ప్రణాళిక లేకుండా ఉండి, కార్యకలాపాల్లో సారూప్యత ఉంటే- ఆ ప్రాంతాలను ఉమ్మడి కార్యక్రమంతో అభివృద్ధి చేయాలి. ఒకదానికొకటి సమీపంలో ఉన్న భూములను కలిపి

వినియోగించి మెరుగైన ఫలితాలను సాధించట మన్నమాట.

- ఇళ్ల నిర్మాణం, సమ్మిళిత పంథా – అందరికీ గృహ సదుపాయాలను అందుబాటులోకి తేవటం.
- నడిచి ప్రయాణించగల ప్రాంతాలను అభివృద్ధి చేయటం – రద్దీని, కాలుష్యాన్ని తగ్గించటం, వనరులను పటిష్టపరచటం, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయటం, పరస్పర సామరస్య సంబంధాలను, మాటామంతీని ప్రోత్సహిస్తూ భద్రతకు భరోసా కల్పించటం. కేవలం వాహనాలు, ప్రజారవాణాకే కాకుండా.. పాదచారులు, సైక్లిస్టుల కోసం ప్రత్యేకమైన మార్గాలతో రోడ్ల నెట్‌వర్క్‌ని నిర్మించటం. అంతేకాదు, నడిచి లేదా సైకిలు ద్వారా వెళ్లే ప్రాంతాలకు అవసరమైన పాలనా సేవలను అందుబాటులోకి తేవాలి.
- పార్కులు, ఆటస్థలాలు, ఆహ్లాదకర (రిక్రియేషన్) ప్రాంతాలు వంటి బహిరంగ ఖాళీ స్థలాల (ఓపెన్ స్పేస్)లను పరిరక్షించుకోవటం. తద్వారా పౌరుల జీవన నాణ్యతను పెంపొందించటం, ఆయా ప్రాంతాల్లో వేడి వాయువుల ప్రభావాల్ని తగ్గించటం, పర్యావరణ సమతూకాన్ని కాపాడటం.
- నీటి సంరక్షణ, మురుగునీటి నిర్వహణ, ఘన వ్యర్థాల మేనేజ్‌మెంట్, పునర్వినియోగం (రీసైక్లింగ్).
- రకరకాల ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాల్ని పెంపొందించటం – పని, నివాసం, షాపింగ్, వినోదం వంటివన్నీ నడక దూరంలో అందుబాటులో ఉండే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చుట్టూ ట్రాన్సిట్ డెవలప్‌మెంట్ (టీఓడీ), ప్రజారవాణా, మారుమూల వీధుల్లోకి పారా ట్రాన్స్‌పోర్ట్ కనెక్టివిటీ.
- పాలనను పౌర స్నేహపూర్వకంగా, ఖర్చుకు తగ్గట్టుగా చేయటం
- ప్రధాన ఆర్థిక కార్యకలాపాల తీరుకనుగుణంగా నగరానికి ఓ గుర్తింపు కల్పించడం
- విపత్తులను తట్టుకునేలా, అధిగమించగలిగేలా ఏరియా ఆధారిత అభివృద్ధిలో స్మార్ట్ పరిష్కారాలను ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు, సేవలకు కూడా వర్తింపచేయటం.

**7) అమలు ప్రణాళిక - సవాళ్లు**

ఈ కింది అంశాలను సవివరంగా అధ్యయనం చేసి, ప్రణాళికగా రూపొందించుకున్నాక.. స్మార్ట్ సిటీ సృష్టిని చేపట్టాలనే ప్రతిపాదన జరుగుతుంది:

- ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధిలో వారి భాగస్వామ్యం
- ఉన్న సమస్యలు
- మౌలిక వసతుల్లో లోపాలు
- వనరులు
- పనికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం
- పద్ధతుల రూపకల్పన, ప్రతి అంశానికి సంబంధించిన సాధారణీకరణల వివరాలను రూపొందించటం
- తక్కువతో ఎక్కువ ఫలితాల్ని సాధించటం. ఉదాహరణకు తక్కువ సమయం, డబ్బు, వనరులతో

తక్కువ ఖర్చుతో సంస్కరణల్ని అమలు చేయటానికి వీలుగా సమయాన్ని, డబ్బుని, సహజ వనరుల్ని సమర్థంగా వినియోగించుకోవటానికి గాను.. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమగ్ర పరిశీలనతో సంబంధిత అంశానికి అన్వయిస్తూ ఉపయోగించటం అవసరం. ఈ విషయంలో, ప్రభుత్వాధికారులు, ప్రజలు కూడా ఇండియన్ బ్యూరో ఆఫ్ స్టాండర్డ్స్ కోడ్‌లను, మాన్యువల్, మార్గదర్శకాలనూ మౌలిక వసతుల డిజైన్లు, అమలులో ఉపయోగించుకోవాలి. మౌలిక వసతుల డిజైన్లను, అమలును స్మార్ట్ పౌరులు పర్యవేక్షిస్తూంటేనే స్మార్ సిటీ అభివృద్ధి కార్యక్రమాలు సుస్థిరాభివృద్ధిగా మారతాయి. ❐

# బిడ్డల బాధ్యత ఇలాగేనా?

**- పి. చిదంబరం,** కేంద్ర మాజీ మంత్రి

**భారత్ 0.44 విలువతో 115 వ స్థానంలో ఉన్నది. అంటే మన దేశం హెచ్‌సిఐలో అట్టడుగున మూడు దేశాలలో ఒకటి. ఎన్డీయే ప్రభుత్వం ఈ నివేదికను కొట్టివేసింది. 'ప్రపంచ బ్యాంకు రూపొందించిన హెచ్‌సిఐని పట్టించుకోకూడదని భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. బాలలందరికీ నాణ్యమైన విద్యా వైద్యాలను సమకూర్చడమే లక్ష్యంగా కొత్త కార్యక్రమాలను రూపొందించి, అమలుపరచడాన్ని కొనసాగిస్తుంది' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.**

**ప్రపంచ బ్యాంకు హెచ్‌సిఐ నివేదిక నన్ను విచారగ్రస్తుడిని చేయగా, దానిపై మోదీ ప్రభుత్వ స్పందన నాకు తీవ్ర ఆగ్రహాన్ని కల్గించింది. భారత్ హెచ్‌సిఐ అంత తక్కువగా ఉండడానికి ఎన్డీయే ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని ఎవరూ విమర్శించలేదు. స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ అందుకు బాధ్యత వహించవలసి వున్నది. ఎన్డీయే ప్రభుత్వం తన వంతు బాధ్యతను అంగీకరించడానికి ససేమిరా అనడం నన్ను కలవరపరుస్తోంది. ఆ వైఖరి ఎంతైనా గర్హనీయం.**

ఈ ధరిత్రిపై ఉన్న ప్రతి ఆరుగురు వ్యక్తులలో ఒకరు భారత్‌లో నివశిస్తున్నారు. మరి మన దేశంలో మానవ జీవితం సంతోషదాయకంగా సాగుతుందా లేక సమస్యలతో సతమతమవుతున్నదా? కొన్ని సర్వేల ప్రకారం భారత్‌లో జీవిస్తున్న వారిలో అత్యధికులు తాము ఆనంద ప్రదమైన జీవితాన్ని గడుపుతున్నట్టు తెలిపారు. అవునా? ఉద్యోగాల కొరత ఎంతగా ఉన్నదో మరి చెప్పనవసరం లేదు. నగరాలలో ఎంతమంది పరిశుభ్రమైన గాలిని శ్వాసిస్తున్నారు? సరే, పల్లెలలోనూ, పట్టణాలలోనూ ఎంతమందికి సురక్షిత తాగునీరు లభిస్తోంది? రహదారులు, ముఖ్యంగా జాతీయ రహదారులు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో చెప్పనవసరం లేదు. శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా లేకపోతే ఆశ్చర్యపోవాలి సుమా! మూక హింసాకాండ, మూక న్యాయం కొత్త సాధారణ అంశాలుగా వర్థిల్లుతున్నాయి కదా. అయినా మన తోటి పౌరులలో అత్యధికులు సంతృప్తికరమైన జీవితాన్ని గడపడం విశేషమే. పైన పేర్కొన్నవన్నీ స్పష్టంగా కనిపిస్తూ ఆందోళన కలిగిస్తున్నవే. కాగా ప్రజల దృష్టికి అంతగా రాని రెండు అంశాలు ఉన్నాయి. ఈ రెండూ బాగా ఆందోళన కలిగించేవే. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే ఆ రెండూ బాలలకు సంబంధించినవి. శతాధిక కోట్ల భారతీయులలో బాలలు 49 కోట్ల మంది ఉన్నారు. వీరందరూ 21వ శతాబ్దంలో జన్మించినవారే.



ఒక బాలుడు/ బాలిక హక్కులేమిటి? ఇల్లు, ప్రేమానురాగాలతో ఆలనా పాలనా చూసే తల్లిదండ్రులు, భద్రత, స్నేహితులు ఉండడంతో పాటు ప్రతి బాలుడు/ బాలికకు కొన్ని హక్కులుంటాయి. బాలలకు ఆ హక్కులు సమకూరేందుకు రాజ్యం పూచీ పడాలి. ఆ హక్కులు – సమగ్ర విద్య, సంపూర్ణ ఆరోగ్యం.

ప్రపంచ బ్యాంకు ఏటా ప్రపంచ అభివృద్ధి నివేదిక ప్రచురిస్తుంది. హ్యూమన్ క్యాపిటల్ ఇండెక్స్ (ప్రతి వ్యక్తి నైపుణ్యాలకు ప్రాతిపదిక జ్ఞాన, కౌశలాలు. శిక్షణ ద్వారా వీటిని పెంపొందించవచ్చు. ఒక దేశ ప్రజలలో ఈ నైపుణ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలిపేదే హ్యూమన్ క్యాపిటల్ ఇండెక్స్–హెచ్‌సిఐ) ఈ నివేదికలో భాగంగా ఉంటుంది. 2019 ప్రపంచాభివృద్ధి నివేదికలో 157 దేశాలకు హెచ్‌సిఐని సూచించారు. ఒక బాలుడు/ బాలిక 18 సంవత్సరాల వయస్సుకు వచ్చే నాటికి సమకూర్చుకునే జ్ఞాన కౌశలాలకు హెచ్‌సిఐ ఒక కొలబద్ద. 'తదుపరి తరం శ్రామికుల ఉత్పాదక సామర్థ్యాన్ని సమగ్ర విద్య, సంపూర్ణ ఆరోగ్యం ప్రమాణాలకు సాపేక్షంగా నిర్ణయించడం జరిగింది. నేడు జన్మించిన ఒక బిడ్డ పద్దెనిమిదేళ్ల వయస్సు వచ్చే నాటికి సమగ్ర విద్య, సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలిగే వెసులుబాటు ఉన్న ఆర్థిక వ్యవస్థకు ఈ సూచీపై 1 పాయింట్‌నివ్వడం జరిగిందని' ప్రపంచ బ్యాంకు పేర్కొంది.

ఏ దేశమూ హెచ్‌సిఐలో 1 పాయింట్‌ను కూడా

పొందలేకపోయింది. కారణమేమిటి? సమగ్ర విద్య, సంపూర్ణ ఆరోగ్య సాధన లక్ష్యాలలో వెనుకబడిపోవడమే. ఇదిలావుంటే 0.88 విలువతో సింగపూర్ 2019 హెచ్‌సిఐలో ప్రథమస్థానంలో ఉన్నది. ఈ సూచీలో మొదటి పది స్థానాలలో ఉన్న దేశాలు 0.80కి పైగా స్కోర్‌ను సాధించాయి. ఈ దేశాలు: సింగపూర్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, జపాన్, హాంకాంగ్, ఫిన్లాండ్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, స్వీడన్, నెదర్లాండ్స్, కెనడా. మొదటి నాలుగు స్థానాలలో ఉన్న దేశాలు ఆసియా దేశాలు కావడం ఒక విశేషం. ఆసియా ఖండవాసులకు గర్వకారణం కూడా. ఐదు అగ్రరాజ్యాలు మంచి ర్యాంకునే పొందినా అదేమీ గొప్ప ర్యాంకు కాదు. హెచ్‌సిఐలో బ్రిటన్ 15వ స్థానంలోను, ఫ్రాన్స్ 22, అమెరికా 24, రష్యా 34, చైనా 46వ స్థానంలోనూ ఉన్నాయి. 157 దేశాలలో 96 దేశాలకు హెచ్‌సిఐ విలువ 0.51 గా ఉన్నది. ఇది మానవాళి విద్య, ఆరోగ్యాలలో సాధించిన సగటు ప్రగతిని తెలుపుతున్నది.

మిగతా 61 దేశాల హెచ్‌సిఐ విలువ 0.50 లేదా అంతకంటే తక్కువగా ఉన్నది. భారత్ 0.44 విలువతో 115 వ స్థానంలో ఉన్నది. అంటే మన దేశం హెచ్‌సిఐలో అట్టడుగున మూడు దేశాలలో ఒకటి. ఎన్డీయే ప్రభుత్వం ఈ నివేదికను కొట్టివేసింది. 'ప్రపంచ బ్యాంకు రూపొందించిన హెచ్‌సిఐని పట్టించుకోకూడదని భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. బాలలందరికీ నాణ్యమైన విద్యా వైద్యాలను సమకూర్చడమే లక్ష్యంగా కొత్త కార్యక్రమాలను రూపొందించి, అమలుపరచడాన్ని కొనసాగిస్తుందని' ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రపంచ బ్యాంకు హెచ్‌సిఐ నివేదిక నన్ను విచారగ్రస్తుడిని చేయగా, దానిపై మోదీ ప్రభుత్వ స్పందన నాకు తీవ్ర ఆగ్రహాన్ని కల్గించింది. భారత్ హెచ్‌సిఐ అంత తక్కువగా ఉండడానికి ఎన్డీయే ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని ఎవరూ విమర్శించలేదు. స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ అందుకు బాధ్యత వహించవలసి వున్నది. ఎన్డీయే ప్రభుత్వం తన వంతు బాధ్యతను అంగీకరించడానికి ససేమిరా అనడం నన్ను కలవరపరుస్తోంది. ఆ వైఖరి ఎంతైనా గర్హనీయం.

హెచ్‌సిఐ అనేది గాలిలోంచి తెచ్చుకునే సంఖ్య కాదు. అది ఆరు అంశాలపై ఆధారపడి ఉంటుంది. ప్రతిదానికీ ఒక లెక్క ఉంటుంది. భారత్ విషయంలో, కుటుంబాల సగటు ఆదాయాన్ని బట్టి పుట్టిన బిడ్డ ఐదు సంవత్సరాల వయస్సు వరకు బతికి ఉండే సంభావ్యత సంతృప్తికరంగా ఉన్నది. వయోజనుల మనుగడ రేటు కూడా సహేతుకంగానే ఉన్నది. హెచ్‌సిఐలో భారత్ మరీ అట్టడుగు స్థానంలో ఉండడానికి కారణాలు 'పాఠశాలలో విద్యాభ్యాస సంవత్సరాలు', 'ఐదేళ్ల వయస్సులోపు బాలల్లో ఎదుగుదల లోటు'. మొదటి అంశంలో భారతీయ బాలల స్కోరు 5.8 సంవత్సరాలు కాగా, రెండో అంశం విషయంలో అది 0.62 గా ఉన్నది. అంటే ఐదు సంవత్సరాల వయస్సులోపు బాలల్లో 38 శాతం మంది ఎదుగుదల సక్రమంగా ఉండడం లేదు. ఈ బాలలు, తమ వయస్సులో ఉండవలసిన ఎత్తు కంటే తక్కువ ఎత్తులో ఉంటున్నారు.

భారత్ హెచ్‌సిఐ చాలా అల్పస్థాయిలో ఉండడానికి కారణాలు తెలుసుకోవడానికి పెద్దగా శ్రమించవలసిన అవసరం లేదు. విద్యాహక్కు మూలంగా పాఠశాలల్లో చేరుతున్న బాలల సంఖ్య ఏటా అధికమవుతోంది. అయితే పాఠశాలల ప్రమాణాలను పెంపొందించే విషయమై శ్రద్ధ కొరవడుతోంది. బోధనా ప్రమాణాలు చెప్పలేనంత నాసిరకంగా ఉంటున్నాయి. అలాగే అంగన్‌వాడీల నిర్వహణ, ఆహార భద్రతా హక్కును సమకూర్చే విషయంలో కూడా శ్రద్ధ కొరవడుతోంది. గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు పాలిచ్చే దశలో ఉన్న తల్లులకు సరైన పోషకాహారం సమకూరడం లేదు. అలాగే బాలలకు మొదటి ఐదు సంవత్సరాలపాటు విధిగా ఇవ్వాల్సిన పోషకాహారం కూడా వారికి అందడం లేదు. ఇందుకు సంబంధించిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల రూపకల్పన, అమలులో అనేక లోపాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పథకాలకు నిధుల కేటాయింపు గురించి చెప్పనవసరం లేదు.

ప్రపంచ బ్యాంకు హెచ్‌సిఐ నివేదికను, గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (ప్రపంచ ఆకలి సూచీ – జిహెచ్‌ఐ) తో కలిపి అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. భారత్‌లో ప్రతి ఏడుగురు బాలల్లో ఒకరు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రతి ఐదుగురు బాలల్లో ఇద్దరి ఎదుగుదల వయస్సుకు అనుగుణంగా ఉండడం లేదు. అలాగే ప్రతి ఐదుగురు బాలల్లో ఒకరు ఎత్తుకు తగ్గ బరువు కలిగివుండడం లేదు. కారణమేమిటి? బలవర్ధకమైన ఆహారం లభించకపోవడమే. ఒక పక్క ఆహారధాన్యాల నిల్వలు అపారంగా పేరుకుపోతున్నాయి. మరో పక్క మన బాలలు ప్రతి ఒక్కరికీ పోషకాహారాన్ని సమృద్ధంగా సమకూర్చలేకపోతున్నాము.

ఈ కఠోర వాస్తవాల దృష్ట్యా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్న అంశాలు దేశ ప్రజలను దిగ్భ్రాంతి పరుస్తున్నాయి. అంతేకాదు ధర్మాగ్రహాన్ని కల్గిస్తున్నాయి. మోదీ సర్కార్ ఏ అంశాలకు ప్రాధాన్యమిస్తోందో మరి చెప్పాలా? అయోధ్యలో ఆలయ నిర్మాణం, గోరక్షణ, ఘర్ వాప్సి, ఉమ్మడి పౌర చట్టం, విగ్రహాల ప్రతిష్ఠాపన, నగరాల పేర్లు మార్చడం మొదలైనవి. మన బాలలకు సమగ్ర విద్యను, సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవి సమకూర్చగలుగుతాయా? ❐

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# రాజకీయమంటే ఇదా?




**- కీర్తి కామేశ్వరి బులుసు,** మలేషియన్ టౌన్‌షిప్

రాజకీయమంటే నిందారోపణలు, నోటికి వచ్చినట్టు తిట్టడమూనా? వేషభాషలు, ఫ్యాషన్లు మార్చుకుంటున్న మహానుభావులు ఈ వాగ్ధోరణి ఎందుకు మార్చుకోరు? తప్పును ఎత్తిచూపడం విమర్శించడం, ఇలా చేస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేయడం అవసరమే! ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల్ని, సాటి నేతలను అందరూ గౌరవించాలి. తిట్టిపోయడం నాగరిక ప్రజాస్వామ్యం కాదు. ఎంత పెద్ద గొంతుతో అరిస్తే అంతగా ప్రచారం వస్తుంది అనుకునే ఆలోచన నుంచి బయటపడాలి.

నేను బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. మా మిత్రపరివారంగానీ, కుటుంబసభ్యులంగానీ ఒకచోట కూర్చుని మాట్లాడుకుంటూ అనేక విషయాలను తెలుసుకుంటుంటాం (మా చర్చల్లో నిన్నటితరం మా అమ్మానాన్నలు, ఇప్పటితరం అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములం అందరూ భాగస్వాములవుతుంటాం). మాటల్లో అన్ని విషయాలూ దొర్లుతుంటాయి. కానీ ఎప్పుడూ ఇలా తిట్టుకోం. రాజకీయాలు, పరిసర ప్రాంతాల సమస్యలు, రాబోయేతరం.. వగైరాల మీద ఆలోచనల్ని ఒక పద్ధతి ప్రకారం పంచుకుంటాం. దీనివల్లే, మాకు క్రమంగా సమాజంలోని మంచీచెడూ మీద అవగాహన వచ్చింది. మాలో ఈరకమైన సామాజిక సంస్కారం పెంపొందటంలో, రాజకీయాల పట్ల మాకు అవగాహన పెంచటంలో లోక్‌సత్తా జేపీగారి పాత్ర ఎంతో ఉంది.

ఇప్పటి మా తరానికి జయప్రకాష్ నారాయణ్ గారి ప్రసంగాలు, రచనలు, సోషల్ మీడియా ఇంటరాక్షన్లు వికీపీడియాలా ఎంతగానో ఉపయోగపడుతుంటాయి. హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్‌లో కొన్న ఆయన 'భవిష్యత్ భారతం' పుస్తకాలు కాంపిటీటివ్ పరీక్షల్లో సైతం రిఫరెన్స్ పుస్తకాల్లా ఉపయోగపడుతుంటాయి. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఉన్నా కొంత వేచి చూడాలనుకుంటున్నాం. ముందు లైఫ్‌లో సెటిల్ అయి సొంత వనరుల్ని సమకూర్చుకోవాలని మా భావన. అయితే ఈలోగా అసలు ఏమీ చేయకుండా ఉంటామని కాదు. ఓటు వేయటం, సక్రమంగా వేయటం, స్థానిక సమస్యలను అర్థం చేసుకుంటూ తోటి యువమిత్రులతో కలిసి సంఘటితంగా పోరాడటం, సోషల్ మీడియాను ఉపయోగించుకుంటూ సామాజిక సమస్యల పరిష్కారం కోసం పనిచేయటం వంటివి చేస్తుంటాం. ఈ మార్పును మాకు అందించినందుకు మా యువత తరపున జేపీగారికి మా యువత ధన్యవాదాలు.

సమాజం కోసం ఇంత కృషి చేస్తున్న జేపీ తన భావాలను ఎంత చక్కగా వ్యక్తం చేస్తారు! ఇతరులను గౌరవిస్తూ, హేతుబద్ధంగా వాదిస్తారు. ఎదుటివారినీ ఒప్పించేందుకు ప్రయత్నిస్తారు. అది చేతగానితనం అనుకున్నవారంతా తర్వాత సమాజానికి నష్టం చేసినవాళ్లే అవుతుంటే, చివరకు జేపీ చెప్పిందే సరైనదవుతోంది. ఇది నేను చాలా సందర్భాల్లో గమనించి చెబుతున్నాను.

రాజకీయం అంటే మన వ్యక్తిగత వ్యవహారం కాదు. మనందరి వ్యక్తిగత జీవితాలనూ ప్రభావితం చేసే ఉమ్మడి కార్యక్రమం. ఉమ్మడి కార్యక్రమాల గురించి మాట్లాడుకునేటప్పుడు, లక్ష్యాల్ని నిర్ణయించుకునేటప్పుడు ఒక పద్ధతి ఉండాలి. అప్పుడే అది ప్రజాస్వామ్యం అవుతుంది, దానికి మంచి ఫలితాలు వస్తాయి. ఇలా బహిరంగ చర్చ ప్రమాణాలను నెలకొల్పితేనే ప్రజాస్వామ్యం బలపడి సామాన్యుల జీవితాలు కూడా

బాగుపడే అవకాశం వస్తుంది. ఎదుటి నేతను గురించి మాట్లాడుతున్నప్పుడు పరోక్షంగా కూడా గౌరవం ఇవ్వని సభ్యులు కొందరిని విశ్లేషిస్తే.. డబ్బుతో పదవిని కొన్నాం అనే అహంకారంతో ఉన్నవారే ఎక్కువగా ఉన్నారు. వారు ఎన్నికల్లో గెలిచి పదవులు వెలగబెట్టడం తప్ప, వారి వల్ల సమాజానికి వచ్చే ఉపయోగం అంటూ ఏమీ ఉండదు. ప్రజలకు కొన్ని తాయిలాల్ని పంచడం, అదేదో తమ జేబుల్లో నుంచి ఇస్తున్నట్టు డబ్బా కొట్టుకోవడం, ఈవెంట్ మేనేజ్‌మెంట్లు చేయటం తప్ప వారిలో ఎటువంటి నాయకత్వ లక్షణాలూ ఉండవు. ఈ డబ్బు, డాంబికాలు, వారి కాన్వాయ్‌లను చూశాక.. రాజకీయాల్లోకి వచ్చి ఏదో మేలు చేయాలన్న ఆలోచన ఉన్న యువత, ఇతర వర్గాల ప్రజల్లో నిరాశానిస్పృహలు పెరుగుతున్నాయి. ఈ మదగజాల్ని ఢీకొట్టే పరిస్థితి ఇప్పటికిప్పుడు లేదు కాబట్టి.. స్థానికంగా నాయకులుగా ఎదగమని, చుట్టూ ఉన్న సమస్యల్ని తెలివిగా పరిష్కరించుకుంటూ సంఘటితశక్తిగా రూపొందమని జయప్రకాష్ నారాయణ్ గారు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ గారు ఇటీవల పర్యటనలు, సమావేశాల ద్వారా ప్రజలకు చెబుతున్నారు. సురాజ్య యాత్ర ద్వారా జేపీ చెప్పిన ఆరు అంశాల ఎజెండాను అమలు చేస్తే తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశంలోనే చాలా గొప్ప మార్పులు వస్తాయి. మా కొత్తతరం మనసుల్లోని ఆలోచనలను సరైన దిశలోకి మళ్లించ డానికి ఈ ఎజెండా ఒక రోడ్‌మ్యాప్‌లా ఉపయోగపడుతుంది. రానున్న ఎన్నికల్లోనూ ఈ ఎజెండా కోసమే ఓటు వేయమన్న జేపీ సూచనను మా సర్కిల్ నూరుశాతం పాటిస్తుంది. జేపీ, లక్ష్మీనారాయణ గారి లాంటి నాయకుల్ని, సురాజ్య ఎజెండాను గెలిపించుకోవటం ద్వారానే మన జీవితాలు మెరుగుపడతాయి. ఇటీవల కేరళలో వరదల సందర్భంగా అద్భుతమైన పనితీరును కనబరిచి రెండు లక్షల మందిని కల్లోలం నుంచి కాపాడిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజగారు లోక్‌సత్తా అభిమాని అంటే ఆశ్చర్యమేముంది? మనం మన జీవితాల్ని బాగుపరుచుకోవటం మీద కాకుండా.. మన కులం, పార్టీ, నాయకుడి జాతకం గురించి ఆలోచిస్తూ ఉంటే, కృష్ణతేజ తన జీవితాన్ని, సమాజహితాన్ని ఆలోచిస్తూ లోక్‌సత్తా బాటలో ఎదిగారు. లోక్‌సత్తా భావజాలాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నవారిలో ఆయనొకరు.

మన యువతకు అనుకున్నది సాధించే సత్తా ఉంది. మనలను నడిపించే సారథులు, మార్గదర్శకులున్నారు. మన నిజమైన స్వార్థాన్ని తెలుసుకుని వారి ఆలోచనలను అనుసరిస్తే చాలు.. మంచి ప్రభుత్వాలు ఏర్పడటం కష్టం కాదు. 'మనకొద్దీ పెత్తందారీ ప్రభుత్వాలు. ఏముంది గర్వకారణం.. వంశపారంపర్య పాలనకై పాట్లు తప్పితే!" 'నేను అధికారాన్ని చేజిక్కించుకుని సేఫ్టీజోన్ ఏర్పాటు చేస్తాను. మీరు అవలీలగా నా వారసత్వాన్ని అందిపుచ్చుకుని పదవిలోకి రావచ్చు' అనే రీతిలో వారసత్వ రాజకీయాలకు ఆ నేతలు పునాదులు వేసుకుంటున్నారు. వారసత్వ, వ్యాపార ప్రయోజనాలు ఆ పార్టీలకు ప్రోత్సాహకాలైతే.. ప్రజాప్రయోజనాలు, తద్వారా అందరికీ ఎదిగే అవకాశాలు లోక్‌సత్తాలాంటి ఉద్యమాలు, పార్టీలకు ప్రోత్సాహకాలు! దోపిడీ ప్రోత్సాహకాలను దెబ్బతీసి, సరైన ప్రోత్సాహకాల రాజకీయ శక్తులను గెలిపించటం కేవలం ప్రజలు మాత్రమే చేయగలిగే పని.

అందుకే మనం తల్చుకుందాం.. సరైన ఎజెండాకు, సరైన అభ్యర్థులు, పార్టీలకు ఓటు వేయటం ఈ ఎన్నికల నుంచైనా ప్రారంభిద్దాం. ❒

## లోక్‌సత్తా 'ఓట్ సవాల్'



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటింగ్ శాతం పెంచడానికి 'ఓట్ సవాల్' కార్యక్రమాన్ని చేపట్టినట్టు లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము అంబర్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో తెలిపారు. నగరంలోని అన్ని నియోజకవర్గాలలో పోలింగ్ 60 శాతం దాటేలా యువతను ప్రోత్సహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటిదాకా ఓటింగ్ ఆ స్థాయిలో జరగలేదన్నారు. ఓట్ సవాల్‌లో భాగంగా వివిధ ఐటీ సంస్థల్లో అవగాహన, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివేక్, యశ్వంత్, నవ్య, ఆదిత్య, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

★ ప్రజలు విప్లవోద్యమం, ఇతర సామాజిక ఉద్యమాల వైపు మరలకుండా ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. తమ పలిక కోసం ప్రజలను యాచకులుగా మార్చివేశారు.

- జి. వేణుగోపాల్ రెడ్డి

★ పేదరికంలో పుట్టడం తప్పు కాదు, పేదరికంలోనే జీవితాన్ని ముగించడం తప్పు అని ఓ రచయిత అన్నారు. సినిమాల్లో మనవారంతా పేదరికాన్ని గ్లామరైజ్ చేశారు. చిరంజీవి కూరగాయల మార్కెట్లో పేదల తరపున సంపన్నులైన విలన్లతో పోరాడుతాడు. వారిని మట్టికరిపిస్తాడు. పేదలకు అండగా ఓ పేదగా నటించినందుకు చిరంజీవి కోట్ల రూపాయల పారితోషికం తీసుకుంటాడు. పేదల కథతో సినిమా తీసిన నిర్మాత, దర్శకుడు కోట్లు సంపాదిస్తారు. చివరకు ఆ సినిమా ఆడిన టాకీస్ సైకిల్ స్టాండ్ వాళ్లు కూడా బాగానే సంపాదిస్తారు. పేదలుగా నటించే జూనియర్ ఆర్టిస్టులకు రోజు కూలీ చెల్లిస్తారు. కానీ ఇలాంటి సినిమాల ప్రభావం పేదలపై బాగానే ప్రభావం చూపుతుంది. పేదరికం పూర్వజన్మ అదృష్టమన్నట్టుగా ఉంటాయి మన సినిమాలు. పేదరికాన్ని గ్లామరైజ్ చేసి చూపించే సినిమాలు, సాహిత్యం ఇక చాలు అని ప్రజలకు వివరించగల ఆర్థిక అక్షరాస్యత తెలంగాణకు కావాలె.

– బుద్ధా మురళి

★ మరింత స్పష్టంగా చెప్పాలంటే స్థానిక సమస్యలు, వ్యవహారాలే ఈ అసెంబ్లీ ఎన్నికల చర్చలలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. అవును మరి శాసనసభా ఎన్నికలు 'మునిసిపలీకరణ' అయ్యాయి. ప్రజల నిత్య జీవితాలతో ముడిపడివున్న సమస్యలను పరిష్కరించేది పురపాలకసంఘాలు, పంచాయతీ మొదలైన స్థానిక స్వపరిపాలనా సంస్థలే కదా. మునిసిపాలిటీలు మొదలైన స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రధానంగా ప్రస్తావించబడే సమస్యలే ఈ శాసనసభా ఎన్నికలలో అత్యధిక ప్రాధాన్యం వహిస్తున్నాయి.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, సీనియర్ జర్నలిస్ట్

★ ఈరోజు నిజమైన, చురుకైన రాజకీయనేత (రైతుకు అధిక ధర వచ్చేందుకు) వ్యవసాయాన్ని మార్కెట్లతో అనుసంధానించడంపైనే దృష్టి పెడతాడు. ప్రభుత్వ వ్యతిరేకత లేక భావజాలం కంటే ఎన్నికల మధ్యప్రదేశ్ గోడలపై ఇవ్వాళ స్పష్టంగా వ్యక్తమవుతున్న సందేశం ఇదే మరి.

- శేఖర్ గుప్తా, ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్-ఇన్-చీఫ్

★ ప్రస్తుతం భారత్ వ్యవసాయ సరకులను ఎగుమతి చేస్తున్నా, అవి కొన్ని దేశాలకు మాత్రమే పరిమితం. మనం ప్రధానంగా సౌదీ అరేబియా, యూఏఈ, యెమెన్, వియత్నాం, మలేషియా, నెదర్లాండ్స్, బ్రిటన్‌లకే వ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేస్తున్నాం. అది కూడా కొన్ని రకాల ఉత్పత్తులనే. మన రైతులు ఎన్నో రకాల పంటలు పండిస్తున్నా వారికి అంతర్జాతీయ విపణిలో గుర్తింపు లేదు. దీనికి చాలా కారణాలున్నాయి. తమ పంటలకు విదేశాల్లో బాగా గిరాకీ ఉందని, అక్కడ మంచి ధర లభిస్తుందని మన రైతాంగానికి తెలియదు. దాంతో బాగా తక్కువ ధరలకు పంటలను అమ్ముకుంటున్నారు. సాంకేతిక నైపుణ్యలేమి, ఉపగ్రహ చిత్రాల సాయంతో ఏయే పంటలు వేయాలో తేల్చుకోవడం, యంత్రాలతో సునిశిత వ్యవసాయం వంటి అధునాతన సాంకేతికతల్లో

మన రైతులు వెనకబడి ఉన్నారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, నిల్వ, శుద్ధి సౌకర్యాలు చాలినన్ని అందుబాటులో లేకపోవడం, ప్రభుత్వం నుంచి సకాలంలో సరైన మద్దతు లభించకపోవడం కూడా రైతుల ముందరి కాళ్లకు బంధాలు వేస్తున్నాయి. ఉత్పత్తి-సరఫరా యంత్రాంగాలు సరిగ్గా అభివృద్ధి చెందకపోవడమూ పెద్ద సమస్య.

- డాక్టర్ పరిటాల పురుషోత్తం, 'సెస్'లో ఆచార్యులు

★ ప్రతి కేసు హైకోర్టు వరకు వెళ్లకుండా కిందస్థాయిలోనే పరిష్కరించుకునే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ముద్దాయిలను రక్షించేందుకు న్యాయవాదులు తయారయ్యారు. వీరికి పోలీసులు, న్యాయవ్యవస్థ తోడ్పాటు అందించటం బాధాకరం. న్యాయమూర్తులు ధైర్యంగా వ్యవహరించాలి, న్యాయవాదులు చట్టాన్ని పరిరక్షించే దిశగా అడుగులు వేయాలి.

- జస్టిస్ బి.శివశంకరరావు, తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి

★ రాజకీయ పార్టీల మేనిఫెస్టోల్లో పాలకులకి ఉపయోగపడే పథకాలే తప్ప ప్రజలకు ఉపకరించేవాటికి స్థానం లేకుండా పోతున్నది.

- జయధీర్ తిరుమలరావు

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సోషల్ మీడియా)

# ఈ 6 అంశాలపై అడిగి ఓటేయ్యండి

ప్రభుత్వం చేయాల్సిన పనుల గురించిన ఊసే లేకుండా ప్రభుత్వం ఏర్పాటు కోసం హోరాహోరీగా జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 6 అంశాలపై అభ్యర్థుల నుంచి స్పష్టత తీసుకుని ఓటెయ్యాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ సూచించారు. ఈ ఆరు అంశాలూ ప్రభుత్వం చేయాల్సిన అసలైన పనులని, తెలంగాణ ప్రజల భవిష్యత్తుకు గట్టి పునాది వేసేవని అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో యూత్ ఫర్ ఇన్‌క్లూజివ్, సస్టెయినబుల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. ఒడిషాకు చెందిన పరిశోధక విద్యార్థి రష్మీ రంజన్‌కు నివాళు లర్పించారు. మహాత్మాఫూలే సేవలను గుర్తుచేశారు.

నాణ్యమైన విద్య, వైద్యం, లాభసాటి వ్యవసాయం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాలకు నిధులు–అధికారాలు, మహిళల భద్రతకు స్థానిక కోర్టులు అనే అంశాల మీద ఆయా పోటీదారుల నుంచి స్పష్టత తీసుకున్నాకే ఓటు వేయాలని జేపీ కోరారు. ఈ ఎజెండా గురించి వివరిస్తూ విద్యార్థులతో చర్చించారు. మన జీవితాల్లో ప్రభుత్వం చేయాల్సిన 20 శాతం పనులే మిగిలిన 80 శాతంగా ఉన్న మన వ్యక్తిగత జీవితాల్ని శాసిస్తున్నాయని, అందువల్ల




ప్రభుత్వాల విధానాలను, అమలును పట్టించుకోవాలని అన్నారు. మన స్వార్థం కోసమే మనం పట్టించుకోవాల్సిన అంశాలివని తెలిపారు. దీన్నేదో భారం అనుకోకుండా ఆడుతూపాడుతూ నాయకుల్లా పనిచేయాలని, www.youthforbetter india.com ను ఇందుకు వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ఇవటూరి రామబ్రహ్మం, కిరణ్‌కుమార్, వాహిని, ముక్తీశ్వర్, శివకుమార్, పవన్, మానస, పావని, స్వాతి, గిరీష్, పలువురు పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. (హెచ్‌సీయూ విద్యార్థులతో జేపీ ఇంటరాక్షన్ వీడియో క్లిప్పింగులను www.facebook.com/jploksatta లో చూడవచ్చు).

# నివారించదగ్గ ఆ మరణాలను ఆపే శక్తి వైద్యులకే ఉంది: జేపీ





వైద్యవిద్యనభ్యసించే సమయంలోనే సాధ్యమైనంత ఎక్కువగా రోగులను పరీక్షించటం, వైద్యులుగా స్థిరపడ్డాక ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణల్ని అందిపుచ్చుకోవటం, సేవాభావంతో వైద్యాన్ని అందించటం ద్వారా ఉత్తమ డాక్టర్లుగా ఎదగగలరని, సమాజానికి ఎంతో మేలు చేయగలరని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. తానూ ఎంబీబీఎస్ చదివానని, అయితే తాను చదివే సమయంలో ఇంత అనుకూల వాతావరణం లేదని అన్నారు. ప్రస్తుత వైద్య విద్యార్థులు ఈ అవకాశాలను ఉపయోగించుకుని నిపుణులైన ప్రాణదాతలుగా ఎదగాలన్నారు. సమాజంలో అన్ని వర్గాలకూ సేవ చేసే పవిత్రమైన వృత్తి వైద్య వృత్తి అన్నారు.

ఏలూరులోని 'ఆశ్రమ్' (అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్) కాలేజ్ డేలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

దేశంలో ప్రస్తుతం ప్రతిరోగానికీ మంచి చికిత్స అందుబాటులోకి రావటం వెనక ఘనత వైద్యులదేనని జేపీ అన్నారు. అయితే ఈ వైద్యం ప్రజలకు భారం కాకుండా అందరికీ అందుబాటులోకి రావాలన్నారు. వైద్యఖర్చులు భరించలేక, మందులు కొనలేక దేశంలో ఏటా అప్పటిదాకా పేదలుకాని 6 కోట్లమంది పేదలుగా మారిపోతున్నారని, ఉపాధి శక్తిని కోల్పోతున్నారని, సకాలంలో వైద్యం అందక 12 లక్షల మంది పిల్లలు చనిపోతున్నారని.. ఇవి మనల్ని కదిలించకపోతే ఒక సమాజంగా, దేశంగా మనమంతా విఫలమైనట్టేనని అన్నారు. నివారించదగ్గ ఆ మరణాలను ఆపే శక్తి వైద్యులకే ఉందన్నారు. ఈ దిశగా ప్రభుత్వ విధానాలను కూడా వైద్యులు ప్రభావితం చేయాలన్నారు. దీనివల్ల ప్రజలతో పాటు వైద్యరంగంతోపాటు యువవైద్యులకు వ్యక్తిగతంగా కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

బ్రిటన్ వంటి దేశాల్లో వైద్యవిద్యకు చక్కటి ప్రవేశ పరీక్ష పెట్టి విజయవంతంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని, మనదేశంలో కూడా మెడిసిన్ ప్రవేశపరీక్షలో మార్పు తీసుకొస్తే మంచి వైద్యులను తగిన సంఖ్యలో దేశానికి అందించవచ్చని జేపీ అన్నారు. దేశంలోనే అత్యాధునిక వైద్యసేవల్ని అందించటంలో ఆశ్రమ్ ఆస్పత్రి, కళాశాల ముందువరుసలో ఉండటం గొప్ప విషయమన్నారు.

ఆశ్రమ్ సంస్థల ఛైర్మన్, ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ, వైద్యం సకాలంలో అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తేవడానికే అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకుని ఆశ్రమ్‌ని 19 సంవత్సరాల కిందట ప్రారంభించామని తెలిపారు. అదే స్ఫూర్తితో పేదలకు ఉచితవైద్యం కూడా అందిస్తున్నామన్నారు. అనేకమందిని వైద్యులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. తమ కళాశాలలో చదువుకున్న పలువురు దేశవిదేశాల్లో ఉత్తమ వైద్యులుగా గుర్తింపు పొంది సేవలందిస్తున్నారన్నారు. ఇది తమకు గర్వకారణమన్నారు. అనంతరం వైద్యవిద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జేపీ బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను అందించారు. ఏడాదికాలంగా రాష్ట్ర, దేశవ్యాప్తంగా జరిగిన ఆటల పోటీల్లో బహుమతులు సాధించినవారికి షీల్డులు అందించారు. ఈ సందర్భంగా వైద్యవిద్యార్థులు నిర్వహించిన నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైస్ ఛైర్మన్ రంగరాజు, కళాశాల డైరెక్టర్ అంజిరెడ్డి, సీఈవో కె.హనుమంతరావు, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, మెడికల్ సూపరింటెండెంట్ ఎస్.విజయమోహన్, డీన్ కె.ఉమామహేశ్వరరావు, ఆశ్రమ్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ❒

# 'పాలనా సంక్షోభం - రాజ్యవ్యవస్థ పాత్ర'



ముస్సోరీలోని లాల్ బహదూర్
శాస్త్రి జాతీయ అకాడమీలో శిక్షణలో
ఉన్న ఐఏఎస్, ఇతర ఆలిండియా
సర్వీసెస్ అధికారులు, గ్రూప్ 'ఎ'
కేంద్ర సర్వీసు, రాయల్ భూటాన్
సివిల్ సర్వీసు అధికారులకు
'పాలనా సంక్షోభం- రాజ్యవ్యవస్థ
పాత్ర'పై వివరిస్తున్న లోక్‌సత్తా
వ్యవస్థాపకుడు
డా॥ జయప్రకాష్ నారాయణ్





# 'స్వతంత్ర' ఆవిష్కరణ



ఆర్థిక సంస్కరణలు, లాభసాటి వ్యవసాయం, అధికార వికేంద్రీకరణ, జీవనోపాధి అవకాశాలు, సుపరిపాలన లక్ష్యాలుగా ఏర్పడిన 'స్వతంత్ర' ఇన్‌స్టిట్యూట్ లోగోను ఇటీవల హైదరాబాద్ ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో జేపీ ఆవిష్కరించారు.

Posting Date 07-12-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on December 1st 2018




"సంస్కర్త దేనికోసమో వేచియుండడు.
విశ్వసించిన వెంటనే ఆచరణలో పెట్టనివాడు సంస్కర్త కానేరడు".

- గాంధీజీ

| Book-Post<br>PRINTED MATTER | To |
| --- | --- |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad